


# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 05-05-2023 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 47 సంచిక : 195 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## నష్టపోయిన రైతులందరికీ
# పరిహారం అందజేయాలి

### కష్టకాలంలో ఏపీ రైతులకు ఊరట.. అధికారులకు సీఎం జగన్ ఆదేశాలు



తాడేపల్లి (విజయభాను న్యూస్) : అకాల వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఊరట కలిగించే విషయం చెప్పారు. నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, అనంతర పరిస్థితులపై తన కార్యాలయ అధికారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. వర్షాల కారణంగా పంట నష్టం తదితర అంశాలపై ప్రాథమికంగా అందిన వివరాలను సీఎం జగన్‌కు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతుల్లో ఏ ఒక్కరికీ పరిహారం అందలేదన్న మాట రాకూడదని.. వారికి పూర్తి స్థాయిలో అండగా నిలవాలని ఆదేశించారు. వర్షాలతో రైతులకు కలిగిన పంట సహా ఇతర నష్టాలను గ్రామ సచివాలయాల స్థాయి నుంచే నిరంతరం వివరాలు తెప్పించుకోవాలని సీఎం జగన్ సూచించారు. రంగుమారిన, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని.. ఇది పూర్తిస్థాయిలో జరగాలన్నారు. ఎన్యుమరేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత నష్టపోయిన రైతుల జాబితాలను గ్రామ సచివాలయాల్లో సామాజిక తనిఖీ కోసం పెట్టాలని సూచించారు. ఎవరైనా మిగిలిపోయినా.. వెంటనే అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు.

**ఆ ముసలి పులిని చూస్తే చంద్రబాబే గుర్తుకొస్తాడు: జగన్**

పంట నష్టపోయిన ఏ రైతుకు కూడా పరిహారం అందలేదనే మాట రాకూడదని సీఎం జగన్ స్పష్టం చేశారు. రబీ సీజన్‌కు ధాన్యం కొనుగోలు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతులకు ఎమైనా ఇబ్బందులు, ఫిర్యాదులు ఉంటే వాటిని నివేదించేందుకు ఓ టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు అధికారులు సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ ఆదేశించారు.

ఎన్యుమరేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత నష్టపోయిన రైతుల జాబితాలను గ్రామ సచివాలయాల్లో సామాజిక తనిఖీ కోసం పెట్టాలని సీఎం జగన్ సూచించారు. రైతుల ముఖంలో చిరునవ్వు కనిపించేలా అధికారుల చర్యలు ఉండాలని ఆదేశించారు. కాగా, అకాల వర్షాలు రాష్ట్రంలో భారీ నష్టాన్ని మిగిల్చిన విషయం విదితమే. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండగా.. మరో తుఫాన్ హెచ్చరికలు ఇప్పుడు రైతులను కలవరపెడుతున్నాయి.

## ఏపీలో నాలుగో మెడికల్ కళాశాల ఏర్పాటుకు ఎన్ఎంసీ గ్రీన్‌సిగ్నల్

అమరావతి, (విజయభాను న్యూస్) : ఏపీలో నాలుగో మెడికల్ కళాశాల ఏర్పాటుకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మచిలీపట్నం మెడికల్ కాలేజీకి అనుమతులు మంజూరు చేసింది. 150 ఎంబీబీఎస్ సీట్లతో 2023-24 సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు ఎన్ఎంసీ అనుమతులు ఇచ్చింది.

ఇప్పటికే విజయనగరం, నంద్యాల, ఏలూరు మెడికల్ కళాశాలల ప్రారంభానికి అనుమతిలిచ్చిన సంగతి తెలిసిందే. త్వరలోనే రాజమండ్రి మెడికల్ కళాశాలకు అనుమతులొస్తాయని వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. మచిలీపట్నం మెడికల్ కళాశాల ఏర్పాటుకు అనుమతులపై మాజీ మంత్రి పేర్ని నాని హర్షం వ్యక్తం చేశారు.

67 ఎకరాల విస్తీర్ణంలో 550 కోట్లతో మచిలీపట్నం మెడికల్ కాలేజీ నిర్మించారు. శరవేగంగా మెడికల్ కాలేజ్ నిర్మాణ పనులు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసింది. బ్రిటిష్ కాలంలో బందరుకు ఎంతో ప్రాముఖ్యత ఉండేదని ఆ ప్రాముఖ్యత మళ్లీ సీఎం జగన్ పాలనలో మళ్లీ బందరుకు ఇచ్చారని పేర్ని నాని అన్నారు. ఈ సందర్భంగా బందరు ప్రజల తరపున సీఎం జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మెడికల్ కాలేజీతో పాటు బందరు ప్రజల చిరకాల కోరిక పోర్టు నిర్మాణానికి 22 తేదీన శంకుస్థాపన సీఎం జగన్ చేయనున్నారని పేర్ని నాని తెలిపారు.

## 4ఏళ్ల చిన్నారిపై హత్యాచారం.. దోషికి క్షమాభిక్ష పెట్టని రాష్ట్రపతి



ఢిల్లీ: మహారాష్ట్రలో నాలుగేళ్ల చిన్నారిపై అతి దారుణంగా లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన కేసులో దోషికి క్షమాభిక్ష పెట్టేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిరాకరించారు. 2008 క్రితం నాటి కేసుకు సంబంధించి దోషి వసంత సంపత్ దుపారే దాఖలు చేసిన క్షమాభిక్ష పిటిషన్ ను ఆమె ఇటీవల తిరస్కరించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ కార్యాలయం గురువారం వెల్లడించింది. ఈ ఏడాది మార్చి 28న దుపారే క్షమాభిక్ష పిటిషన్‌ను కేంద్ర హోంశాఖ.. రాష్ట్రపతి సచివాలయానికి సిఫార్సు చేసింది. ఈ పిటిషన్‌ను ఏప్రిల్ 10వ తేదీనే రాష్ట్రపతి ముర్ము తిరస్కరించినట్లు ప్రెసిడెంట్ సెక్రటేరియట్ తెలిపింది. 2008లో మహారాష్ట్రలో ఓ నాలుగేళ్ల బాలిక, వసంత దుపారే (అప్పటికి అతని వయసు 46 ఏళ్లు) చేతిలో దారుణ హత్యాచారానికి గురైంది. చిన్నారి పొరుగింట్లో ఉండే దుపారే.. తినుబండారాల ఆశ చూపించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను బండరాళ్లతో మోది హత్య చేశాడు. చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దుపారేను అరెస్టు చేశారు. అనంతరం విచారణ జరిపిన ట్రయల్ కోర్టు.. అతడిని దోషిగా తేల్చి మరణశిక్ష విధించింది. ఆ శిక్షను బాంబే హైకోర్టు సమర్థించింది.

ఈ తీర్పుపై 2014లో దుపారే సుప్రీంకోర్టు ను ఆశ్రయించగా అక్కడ ఊరట లభించలేదు. అతడి మరణశిక్షను అత్యున్నత న్యాయస్థానం కూడా సమర్థించింది. దీంతో ఈ తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ 2016లో దుపారే మరో పిటిషన్ దాఖలు చేశాడు. అయితే ఈ రివ్యూ పిటిషన్‌ను 2017లో సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. అతడు చేసిన నేరం అత్యంత హేయమైనదని అప్పట్లో కోర్టు అభిప్రాయపడింది. అతడి మరణశిక్షను మరోసారి సమర్థించింది. దీంతో అతడు క్షమాభిక్ష కోరగా.. రాష్ట్రపతి అందుకు నిరాకరించారు.

## బేటీ బచావో నినాదం బూటకం
### : రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్‌భూషణ్ సింగ్‌కు వ్యతిరేకంగా జంతర్ మంతర్ వద్ద రెజ్లర్లు చేపట్టిన ఆందోళనపై పోలీసులు బలప్రయోగం చేయడం కలకలం రేపుతోంది. ఢిల్లీ పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకున్న అనంతరం ఈ ఉదంతంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించారు. భరతమాత బిడ్డలపై మోదీ సర్కార్ వేధింపులకు పాల్పడుతోందని దుయ్యబట్టారు.


దేశ క్రీడాకారుల పట్ల ఇలాంటి ప్రవర్తన సిగ్గుచేటని, బేటీ బచావో నినాదం బూటకమని తేలిపోయిందని రాహుల్ దుయ్యబట్టారు. దేశానికి ఎన్నో పతకాలు, కీర్తిని తీసుకువచ్చిన మహిళా క్రీడాకారిణులు కన్నీరు కార్చేలా చేయడం బాధాకరమని అన్నారు. క్రీడాకారిణులు, వారి కుటుంబ సభ్యులు త్యాగాలతో, అంకితభావంతో దేశానికి సేవలు అందిస్తారని పేర్కొన్నారు. వారి ఆందోళనను సానుభూతితో అర్థం చేసుకుని సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని రాహుల్ సోదరి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. దేశంలో చాంపియన్ ప్లేయర్ల పట్ల పోలీసుల తీరును ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఖండించారు. ఇది అత్యంత బాధాకరం, సిగ్గుచేటని ఆయన వ్యాఖ్యానించారు. వ్యవస్థలన్నింటినీ తమ కనుసన్నల్లో నడిపించాలని కాషాయ పాలకులు భావిస్తున్నారని దుయ్యబట్టారు. బీజేపీని అధికారం నుంచి తప్పించాలని ప్రజలకు ఆయన పిలుపు ఇచ్చారు. మరోవైపు పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మహిళా క్రీడాకారులకు బాసటగా నిలిచారు. మనమంతా మనుషులుగా మన రెజ్లర్లకు అండగా నిలవాలని అన్నారు. ఈ రకంగా మన పిల్లల గౌరవానికి కేంద్ర ప్రభుత్వం భంగకరంగా వ్యవహరించడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

## రైతుల వద్దకు ఎందుకు రారు
### తెదేపా అధినేత చంద్రబాబు



ఏలూరు, (విజయభాను న్యూస్) : రాష్ట్రంలో రైతుల బాధలు చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని తెదేపా అధినేత చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నాచుగుంటలో గురువారం ఆయన పర్యటించారు. అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా మొలకలు వచ్చిన ధాన్యాన్ని చంద్రబాబుకు చూపిస్తూ.. రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. చిరిగిన సంచులు ఇచ్చారు చూడండంటూ తరువాయి 2లో..

## యూపీలో ఎన్‌కౌంటర్.. మరో గ్యాంగ్‌స్టర్ హతం



ఉత్తరప్రదేశ్ : రాష్ట్రంలో మరో సంచలన చోటు చేసుకుంది. ఇటీవల యూపీలో పేరుమోసిన గ్యాంగ్‌స్టర్ అతీక్ సోదరులు ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. తాజాగా మరో గరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. ఢిల్లీ- రాజధాని ప్రాంతంలోని నోయిడా, ఘజియాబాద్ తదితర ప్రాంతాల్లోని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన గరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ అనిల్ దుజానా తరువాయి 2లో..




## బీహార్‌లో కుల గణనపై స్టే విధించిన హైకోర్టు

పాట్నా: బీహార్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే ను ఆ రాష్ట్ర హైకోర్టు నిలిపివేసింది. ప్రజల ఆర్థిక, కుల హోదాకు సంబంధించిన డేటాను సేకరించేందుకు నితీశ్ కుమార్ సర్కార్ సర్వే చేపట్టింది. ఇంటింటి సర్వేను రాష్ట్రంలోని అన్ని ప్రతిపక్ష పార్టీలు స్వాగతించాయని ఇవాళ ఉదయం సీఎం నితీశ్ తెలిపారు. నిజానికి కుల గణన కేంద్ర ప్రభుత్వం చేపట్టాల్సిన ప్రక్రియ, కానీ బీహార్‌లో రాష్ట్ర సర్కారు ఆ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. సర్వేను వ్యతిరేకిస్తున్న వారిపై ఆయన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

అవసరమైన వారికి సేవలు అందించడంలో సర్వే ఉపయోగపడుతుందని సీఎం నితీశ్ తెలిపారు. తొలి రౌండ్ సర్వే జనవరి 7వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించారు. ఇక రెండవ సర్వే ఏప్రిల్ 15 నుంచి మే 15వ తేదీ వరకు నిర్వహించాల్సి ఉంది.

## సీఎం జగన్‌ను కలిసిన పలు ఉద్యోగ సంఘాల నేతలు



అమరావతి, (విజయభాను న్యూస్) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పలు ఉద్యోగ సంఘాల నేతలు గురువారం కలిశారు. టీడీపీ హయాంలో తొలగించిన 500 మంది మండల సమన్వయకర్తలకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌లో అవకాశం కల్పించటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సర్వే డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున సుమారు 11 వేల మంది గ్రేడ్-3 సర్వేయర్లను గ్రేడ్-2 సర్వేయర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినందుకు సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిసిన ఏపీ సర్వే ఎంప్లాయిస్ అసోసియేషన్.. కృతజ్ఞతలు తెలిపింది. ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఛైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ జేఏసీ ఛైర్మన్ వివిఎస్ దివాకర్, సర్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్. చిరంజీవిరావు వారి వెంట ఉన్నారు.

## డైరెక్ట్ మేనేజ్మెంట్ లోని వక్ఫ్ సంస్థలకు

# కమిటీలు నియమించాలి

### కేంద్ర వక్ఫ్ కౌన్సిల్ కు లేఖ రాసిన జాతీయ మైనారిటీస్ కమిషన్ సలహాదారుడు




అమరావతి(విజయభాను న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వక్ఫ్ బోర్డు కొన్ని సంస్థలను ఐదు సంవత్సరాలు పైబడి డైరెక్ట్ మేనేజ్మెంట్ పేరుతో వారి స్వాధీనంలో పెట్టుకోవడం వక్ఫ్ చట్టానికి విరుద్ధమని, దీనిపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కేంద్ర కౌన్సిల్ కార్యదర్శి కు లేఖ రాసిన జాతీయ మైనార్టీస్ కమిషన్ సలహాదారుడు యం.అర్షద్ ఆయుబ్ ఖాన్. వక్ఫ్ చట్టం, 1995 లోని సెక్షన్ 65 ప్రకారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఏదైనా సంస్థను డైరెక్ట్ మేనేజ్మెంట్ లో తీసుకున్నట్లయితే ఐదు సంవత్సరాల లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసి, కమిటీ లేకా ముతవల్లిని గాని నియమించాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రం ఇందుకు భిన్నంగా ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్న, సంస్థలను డైరెక్ట్ మేనేజ్మెంట్లు పేరుతో వారి స్వాధీనంలో పెట్టుకుని, అందులో వచ్చే ఆదాయాన్ని ఆ సంస్థకు ఖర్చు పెట్టకుండా వక్ఫ్ బోర్డు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కొంతమంది సిబ్బందికి జీతాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. వారి జీతభత్యాల కోసమే డైరెక్ట్ మేనేజ్మెంట్ లో సంస్థలను ఉంచడం సరైన పద్ధతి కాదని వీటిపై వెంటనే విచారించి చర్యలు తీసుకోవాలని సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ సెక్రటరీకి లేఖలో సూచించారు.

## ప్లాస్టిక్ నిషేధాన్ని పైలి కరపత్రం విడుదల

విజయభాను యానం : కేంద్ర పాలిత ప్రాంతం యానం నియోజవర్గం అంతట ప్లాస్టిక్ నిచ్చేదాన్ని అమలులోకి తీసుకురావాలని గురువారం ఉదయం మున్సిపల్ కార్యాలయం నందు కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతనంగా నియమితులైన మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయిల్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యానం కి సంబంధించి వర్తక సంఘం, బార్ అండ్ అసోసియేషన్, చిరు వ్యాపారులు యానం హెచ్ ఆర్ స్క్వే సిబ్బంది అవగాహన కల్పిస్తూ, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే నష్టాలను గురించి సభలో ప్రసంగించారు. అనంతరం పలువురి అభిప్రాయాలను సేకరించి తూచా క్రమంతప్పకుండా ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేసేందుకు కార్యచరణ సిద్ధం చేశారు. అనంతరం ప్లాస్టిక్ నిషేధం పై కరపత్రాన్ని విడుదల చేసి పలువురికి అందజేశారు. అలాగే పలువురి అభిప్రాయాల మేరకు జూన్ వరకు ప్లాస్టిక్ వాడకం నిషేధం పెనాల్టీ సంబంధించి ఆలోచిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం ప్రెసిడెంట్ నల్ల వెంకన్న, నల్లం నాగబాబు, గోపాలకృష్ణ, బట్టల వ్యాపారి, శ్రీనివాసరావు, శ్రీనివాసులు మున్సిపాలిటీ అధికారులు మేడిశెట్టి రామలింగేశ్వరరావు, మున్సిపాలిటీ ఇంచార్జ్, కండవల్లి రామకృష్ణ చెల్లి గోపి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కన్నబాబు కళ్లుగప్పి అవినీతి చక్రం తిప్పుతున్న చోటా నాయకుడు...

**స్వామినగర్లో కోట్ల రూపాయల విలువ చేసే భూమి స్వాహా..**
**విచారణ జరిపి కారకుల పై చర్యలు తీసుకోవాలని**
**మాజీ ఎంపీటిసి పితాని రాము డిమాండ్...**

కాకినాడ రూరల్.... కాలంతో పోటీపడి అభివృద్ధి చెందుతున్న నగరాల్లో కాకినాడ నగరం కూడా ముందు వరుసలో ఉంది. వ్యాపార వాణిజ్య రంగాలకు సంబంధించిన వివిధ సంస్థలు ఇక్కడ తమ కార్యకలాపాలు నిర్వహించుకోవడంతో కాకినాడలో భూమి ధరలకు గిరాకీ పెరిగింది. అలాగే కాకినాడ నగరానికి చేరి ఉన్న గ్రామాల్లో కూడా భూమి ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో అక్రమార్కుల కంటి చూపు ప్రభుత్వ స్థలాలపై పడింది రాజకీయ పలుకుబడితో అధికార యంత్రాంగాన్ని చెప్పు చేతల్లో పెట్టుకుని ద్వితీయ శ్రేణి నాయకులు చేస్తున్న కబ్జాల పర్వంలో కాకినాడ గ్రామీణ ప్రాంతం స్వామి నగర్ లో కోట్ల రూపాయల విలువచేసే కామన్ సైట్ కైంకర్యానికి గురయిందనే వాదనలు వినిపిస్తున్నాయి.సుమారు 10 సెంట్ల భూమిని స్థానిక నాయకుడు కబ్జాచేసి అనంతరం రూ 3 కోట్ల రూపాయలు చేతులు మారాయి అనే అభియోగం పై తూరంగి మాజీ ఎంపీటిసి పితాని వెంకటరాము స్పందించారు. గత తెలుగు దేశం పార్టీ హాయాంలో సర్వే నెంబర్ 112,113లో అప్పటి ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి 63 మంది లబ్ధిదారలకు నివేశ స్థలాల పంపిణీ కార్యక్రమంలో పట్టాలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. అయితే ఈ సర్వే నంబర్లో ఉన్న భూమి పల్లపు ప్రాంతం కావడంతో దానిని మెరక చేసుకోలేక లబ్ధిదారులు ఆగిపోయారు అనంతరం ఎన్నికలు రావడం వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్వామినగర్ ఇళ్ళ స్థలాల వివాదంలో చిక్కుకుంది. పాత లబ్ధిదారుల స్థానంలో వైకాపా కార్యకర్తలకు చోటు ఇవ్వడంతో పరిస్థితి మరింత జటిలంగా మారి న్యాయస్థానం, లోకాయుక్త గడప తొక్కింది. ఇప్పటికీ ఈ అంశం కోర్టు పరిధిలో కొనసాగుతునే ఉందని మాజీ ఎంపిటిసి పితాని వివరించారు. అయితే సందట్లో సడేమియా అన్నట్లు ఈ లే అవుట్ కు సంబంధించిన కామన్ సైట్ మరియు అప్పుడు ఎమ్మార్వో చేసిన లేఅవుట్ ను మార్చి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు కు తేలియకుండా కోట్ల రూపాయల జేబులో నొక్కేసిన స్దానిక వైకాపా నాయకుడి అవినీతి పై ఎమ్మెల్యే కన్నబాబు విచారణ జరిపించి దోషుల పై చర్యలు తీసుకోవాలని పితాని రాము డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పేరు చెప్పి ప్రజాధనాన్ని లూ టి చేసే అవినీతి నాయకులను ప్రోత్సహిచే విధానానికి ఎమ్మెల్యే కన్నబాబు దూరంగా ఉండాలని హితవు పలికారు.

**మొదటి పేజీ తరువాయి**

## యూపీలో ఎన్కౌంటర్.. మరో గ్యాంగ్స్టర్ హతం

ఉత్తరప్రదేశ్ మీరట్కు చెందిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసుల చేతిలో హతమయ్యాడు. పశ్చిమ యూపీకి చెందిన అనిల్ దుజానాపై హత్యలు, దోపిడీలు, భూ కబ్జాలు వంటి కేసులు నమోదయ్యారు. మొత్తం 62 కేసుల్లో నిందితుడిగా ఉన్న అతను.. 2012 నుంచి జైల్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో 2021లో అతను బెయిల్పై విడుదలయ్యాడు. అయితే పాత కేసుల్లో కోర్టుకు హాజరుకాకపోవడంతోపాటు.. తనపై నమోదైన హత్య కేసులో కీలక సాక్షులను బెదిరిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే అతడిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. అతన్ని పట్టుకునే క్రమంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో అనిల్ దుజానా హతమైనట్లు తెలుస్తోంది.

## రైతుల వద్దకు ఎందుకు రారు

వాటిని చూపించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ఈ నాలుగేళ్లలో ఎప్పుడైనా జగన్ పొలంలో దిగారా? సీఎంకు బాధ్యత లేదా.. రైతుల వద్దకు ఎందుకు రారు? అన్నదాతలు ఇబ్బందుల్లో ఉంటే ఎయిర్పోర్టుకు శంకుస్థాపనా? అది కూడా గతంలో శంకుస్థాపన చేసిన దానికే మళ్లీ చేస్తారా? ధాన్యం సంచులు కూడా ఇవ్వలేని ప్రభుత్వాన్ని ఏమనాలి? రైతులకు న్యాయం జరిగేవరకు అండగా ఉంటా" అని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

## ఫిషింగ్ హార్బర్ అభివృద్ధిలో

# అదనపు వసతులు కల్పించాలి

- **హార్బర్ లో నియంతలా ప్రవర్తిస్తున్న ఫిషరీస్ జెడి ను బదిలీ చేయాలి.**
- **ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వాసుపల్లి జానకిరామ్**



విశాఖపట్నం (విజయభాను న్యూస్): ఫిషింగ్ హార్బర్ లో చేపడుతున్న అభివృద్ధి పనులు అస్తవ్యస్తంగా చేయడం, జిల్లా మత్స్యశాఖ అధికారి నియంత ధోరణిపై మత్స్యకారులు పడుతున్న నిబ్బందులను తెలియజేయడానికి గురువారం ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్. కార్యాలయంలో ప్రెసిడెంట్ వాసుపల్లి జానకిరామ్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి కోసం తయారుచేసిన (డిపిఆర్ )ప్రాజెక్ట్ రిపోర్ట్ లో మత్స్యకారుల అవసరాలను పరిగణలోకి తీసుకోకుండా కనీసం ప్రజాభిప్రాయ సేకరణ కూడా జరగకుండా తయారుచేసిన ముసాయిదా వలన ఫిషింగ్ హార్బర్ బోట్ యజమానులకు మత్స్యకారులకు ఉపయోగం తక్కువగా ఉంటుందని, స్థలాభావం వలన అనేక సమస్యలతో ఉన్న మత్య పరిశ్రమలో మత్స్యకారులకు అవసరమైన నాలుగు అదనపు ఫింగర్ జెట్టిలను కాంక్రీట్తో నిర్మించకుండా ఫ్లోటింగ్ జెట్టీలు నిర్మించి బలవంతంగా మత్స్యకారులకు అండకట్టడానికి చూస్తున్నారని, హుధూద్ సునామీ లాంటి ప్రకృతి విపత్తులను ఫిషింగ్ హార్బర్ లో తట్టుకొని నిలబడాలి అంటే కచ్చితంగా కాంక్రీట్ జెట్టీలు నిర్మించవలసిన అవసరం ఉందని దీనికిగాను డీపీఅర్లో మార్పులు చేయాలని అధ్యక్షుడు అసోసియేషన్ అధ్యక్షుడు జానకిరామ్ కోరారు. అంతేకాకుండా జిల్లా మత్స్యశాఖ అధికారిని నియంతృత్వ ధోరణి మత్స్యకారులకు కనీస సమాచారం ఇవ్వకుండా ఫిషింగ్ హార్బర్ లో రోడ్లను తవ్వించేసి వ్యవస్థను స్తంభింప చేసిన పరిస్థితిపై మత్స్యశాఖ జెడి ఫిషరీస్ వారిని ప్రశ్నిస్తే నియంత లా దుర్భాషలాడుతూ మత్స్యకారులకు బోటు యజమానులకు కనీస గౌరవం కూడా ఇవ్వకుండా ప్రవర్తిస్తున్న తీరు మత్స్యకారులను అరెస్టు చేస్తామని బెదిరిస్తుండడంతో ఈ ధోరణి వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థలో కాకుండా బానిస బ్రతుకులు బ్రతుకుతున్నామా అని మత్యకారులు ప్రశ్నించుకునే పరిస్థితి జెడి ఫిషరీస్ తీరు వలన అనిపిస్తుందని మత్స్యకారుల అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా ఆమె తీసుకుంటున్న చర్యల వలన మత్స్యకారులు అందరు ఇబ్బందులు పడుతున్నారు కాబట్టి ఈరోజు మత్స్యకారులు రోడ్డుపై కొచ్చి నిరసన తెలియజేసే పరిస్థితి ఉంది కాబట్టే వెంటనే ప్రస్తుతం ఇన్చార్జిగా కొనసాగుతున్న మత్స్యశాఖ అధికారిని ఆమె మాతృ స్థలానికి తిరిగి పంపించి ఇక్కడే ఒక పర్మినెంట్ ఫిషరీస్ జెడి నియామకం చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ కోరారు . అదేవిధంగా అదనపు వసతులను డిపిఆర్ లోని అదనంగా పొందుపరిచి వాటిని మంచినీటి వసతి , కరెంటు సౌకర్యం, చిరు వ్యాపార దగ్గర నుంచి పెద్ద వ్యాపారం చేసుకునే మత్స్యకార యువతకు అదనంగా ప్యాకింగ్ ఫెసిలిటీ స్థలాన్ని అందుబాటులోకి తీసుకొని రావాలని, మునిగిపోయినటువంటి వెసల్లను బయటకు తీయించాలని, జట్టిలు మరమ్మత్తులు చేయాలని, బీచింగ్ పాయింట్ సదుపాయం, క్రేన్ సదుపాయం కల్పించాలని, హార్బర్లో విశ్రాంతి భవనం ఓపెన్ చేపల వేలం కేంద్రం పూర్తిస్థాయిలో నిర్మించాలని, ముందస్తు అవసరమైన పనులను మొదటి విడతల్లోని పూర్తి చేయాలని ప్రధానంగా చేపల విక్రయ కేంద్రం లో షెడ్డు, జడ్జీలను మరమ్మత్తులు వంటి వాటిని మొదటిగా పూర్తిచేసి తర్వాత డి పి ఆర్ లో ఉన్న పనులను పూర్తి చేసుకోవాలని ఈ అంశంపై జిల్లా కలెక్టర్ గారు పూర్తిస్థాయి వివరణ చేసి జేడిని బదిలీ చేసి మత్స్యకారులకు అనుకూలమైన పనులను ముందస్తు సమాచారం ఇచ్చి చేపట్టాలని ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మత్స్యకారులకు న్యాయం చేయాలని జానకిరామ్ కోరారు. ఈ సమావేశంలో ఏపీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మైలిపిల్లి లక్ష్మణరావు, కోశాధికారి మైలిపిల్లి నరసింహులు డాల్ఫిన్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్ వీరన్న, కోస్టల్ అసోసియేషన్ అధ్యక్షుడు బర్రీ కొండ, ఉపాధ్యక్షులు గుంటు దానయ్య దూడ పోలయ్య, గనగళ్ళ రాజేష్, అధిక సంఖ్యలో బోటు యజమానులు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# సివిల్ కి డిఫెన్స్ కు తేడా తెలియని సీఎం

**చేసిన శంకుస్థాపనలే మళ్లీ చేయడం సిగ్గుచేటు**

**ఉత్తరాంధ్ర అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేసే ధైర్యం ఉందా**

**రాష్ట్రంలో రామోజీరావు, ఆదిరెడ్డి లే చిట్ ఫండ్స్ కంపెనీలు నడుపుతున్నారా**

**రాష్ట్రంలో డ్రగ్స్ విచ్చలవిడిగా దొరుకుతున్నాయి**

**మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : సివిల్ కి డిఫెన్స్ కు తేడా తెలియని సి యం జగన్ రెడ్డి అని మాజీమంత్రి, ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఉదయం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో గంటా మాట్లాడుతూ భోగాపురం ఎయిర్పోర్ట్, ఆధాని డేటా సెంటర్లకు సీఎం జగన్ మళ్ళీ శంఖుస్థాపన చెయ్యటం సిగ్గుచేటని అన్నారు. అధికారంలోకి వచ్చిన 4 ఏళ్ల తర్వాత రాజకీయ లబ్ధి కోసం శంఖు స్థాపన చేశారని అన్నారు. ప్రతిపక్షంలో జగన్ మాట్లాడిన మాటలకు అధికారంలో మాటలకు పొంతన లేదని ఎద్దేవా చేశారు. డిఫెన్స్, సివిల్ కి తేడా జగన్ కి తెలుసా అని ప్రశ్నించారు. ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి కి కనీస అవగాహన లేదనేది తెలుస్తుంది అని అన్నారు. ఊసరవెల్లి కూడా జగన్ లా రంగులు మార్చలేదని, పెట్టుబడుల సదస్సు జరిగి రెండు నెలలు అయ్యింది ఇప్పటివరకు రివ్యూ కూడ నిర్వహించలేని పరిస్థితి లో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి పై శ్వేతపత్రం విడుదల చెయ్యగల దైర్యం ఉందా అని సవాల్ విసిరారు. దానిపై చర్చకు సిద్ధంగా ఉన్నాం మీరు సిద్ధమేనా ప్రశ్నిస్తే టీడీపీ నేతల ఆస్తుల్ని ధ్వంసం చేస్తున్నారు. ఋషికొండ ను ధ్వంసం చేశారు. రాష్ట్రంలో రామోజీరావు, ఆదిరెడ్డి లే చిట్ ఫండ్స్ కంపెనీలు నడుపుతున్నారా అని ప్రశ్నించారు. మిగతా వారు నడుపుతోంది కన్పించడం లేదా అన్నారు. ఇది ముమ్మాటికీ కక్ష సాధింపు చర్యలేనని ప్రభుత్వానికి కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యిందన్నారు. సిట్ కు సంబంధించి మీకు అనుకూలంగా వచ్చిందని సంబరాలు చేసుకుంటున్నారు చంద్రబాబు అరెస్ట్ అవ్వడం ఖాయ మంటున్నారు కాని అది మీ వల్ల కాదనేది అందరికి తెలుసు అని అన్నారు. హైదరాబాద్ డెవలప్మెంట్ గురుంచి గతంలో కేటీఆర్ మెచ్చుకున్నారు ఇపుడు అదే విషయాన్ని రజనీకాంత్ చెప్పారు.చంద్రబాబు ని మెచ్చుకోవడం తట్టుకోలేక వైసీపీ నేతలు కుక్కల్లా మొరుగుతున్నారు.రాష్ట్రంలో డ్రగ్స్ విచ్చలవిడిగా దొరుకుతున్నాయని దేశంలో ఎక్కడా దొరికినా ఏపీ మూలాలు బయటకు వస్తున్నాయి అని ఆక్షేపించారు.జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం జగన్ సైకోలా తయారయ్యారు అన్నారు. హెలికాప్టర్ లో వెళ్లే సీఎం కోసం 100 కిలోమీటర్ల రూట్ బ్లాక్ చేశారు.రూట్ లేని ఏరియాలో రెండు రోజులపాటు దుకాణాలు మూసేయడం దారుణం అని దుయ్యబట్టారు. 840 కేజీలతో 4గురు యువకులు దొరకడం దారుణం అన్నారు.

యువత కు ఉపాధి లేక గంజాయి రవాణా చేసె పరిస్థితి వచ్చింది అని అన్నారు. రెండు లక్షల గంజాయి దొరకడం రాష్ట్ర పరిస్థితి అర్ధమవుతుంది. ప్రభుత్వ ఉద్యోగాల సంగతి ఈ ప్రభుత్వం మర్చిపోయింది అని వ్యంగ్యంగా అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో యువత నిర్వీర్యం అయిపోయింది ఏపీ కాస్తా గంజాయి బౌల్ గా మారిపోయింది యువత భవిష్యత్ పై దృష్టి పెట్టండి అని చెప్పారు. ఆధాని డేటా కోసం ఔట్ రేట్ సేల్ చేసేసారు అని ఆరోపించారు.

తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతు

టీడీపీ హయాంలో 5 లక్షల పైగా ఉద్యోగాలు ఇచ్చారని మాజీమంత్రి గౌతంరెడ్డి చెప్పారు.వైసీపీ హయాంలో వాలంటీర్ ఉద్యోగాలు ఇచ్చారు.

రెండు రోజుల్లో రిటరైయ్యేలా ఉద్యోగాలు ఇచ్చారని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి లేదు,ఏపీని గంజాయి వనంగా చేశారని చెప్పారు. ఎమ్మెల్సీ చిరంజీవిరావు మాట్లాడుతూ జగన్ ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చారు.రాష్ట్రంలో నిరుద్యోగులకు నో చాన్స్ 26 లక్షల మంది నిరుద్యోగులు వున్నారు. వాలంటీర్ లకు ఉద్యోగం అని చెప్పి నెలకు 5 వేలు జీతం ఇస్తున్నారు.కార్ డ్రైవర్ కి 18 వేలు జీతం ఇస్తున్నారు అని అన్నారు. మరి 5 వేలు జీతమిచ్చే వాలంటీర్ ది ఉద్యోగమా

రాష్ట్రంలో నిరుద్యోగులకు అవకాశాలు లేక బయటకు వెళ్లిపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వ వేధింపుల వల్ల పరిశ్రమలు తరలిపోతున్నాయి అని ఆరోపించారు. ఈ కారణం వల్ల కూడా నిరుద్యోగ సమస్య బాగా పెరిగిందని చెప్పారు.

స్టార్ట్ అప్ లు ప్రక్క రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాయి అని ఆరోపించారు. మెగా లార్జ్ ఇండస్ట్రీస్ గ్రోత్ 12 శాతంకు పడిపోయిందని అన్నారు.దక్షిణ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గండి బాబ్జి మాట్లాడుతూ మొన్న వైజాగ్ వచ్చినప్పుడు కాపురం పెడతాను అని సీఎం జగన్ రెడ్డి అన్నాడు మరి ఆయన కాపురం పెట్టడం వలన ఇక్కడ ఒరిగేది ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం డి నజీర్, ఉత్తర నియోజకవర్గం ఇంచార్జ్ చిక్కాల విజయబాబు, భీమిలి ఇంచార్జ్ కోరాడ రాజబాబు, జోన్ 1 మీడియా కోఆర్డినేటర్ బైరెడ్డి పోతన్న రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఉద్యోగ అర్హత వయో పరిమితి పెంచాలి



జంపా వెంకటరమణ

కొయ్యూరు (విజయభాను న్యూస్) ం నిరుద్యోగులకు ఉద్యోగ అర్హత వయో పరిమితి పెంచాలని టీడీపి ఎస్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి జంపా వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ పదవి విరమణ వయో పరిమితి పెంచడం వలన నిరుద్యోగులకు చాలా నష్టం వాటిల్లిందని, ఉద్యోగులకు గతంలో మాదిరిగానే పదవీ విరమణ సమయానికి జరిగి ఉంటే ఉద్యోగ కాలీలు ఏర్పడి ఉద్యోగ ప్రకటనలు వెలువడేవి. తద్వారా నిరుద్యోగులుకు ఉద్యోగావకాశాలు వచ్చి ఉండేవని, కానీ ప్రభుత్వం పదవీ విరమణ వయసు పెంచడం వల్ల విరమణ కావాల్సి ఉన్న ఉద్యోగులు సర్వీసులు కొనసాగించాల్సి రావడంతో కాళీల సంఖ్య తగ్గి నిరుద్యోగుల బతుకుల్లో బుగ్గి జల్లినట్టు అయిందన్నారు. పైగా నాలుగు, అయిదు సంవత్సరాలలో ఉద్యోగ వయో పరిమితి పూర్తి అయ్యేవాల్లు తీవ్రంగా నష్టోతున్నారని, దాదాపు ఒక తరం భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. కావున ప్రభుత్వం చేసిన తప్పుని ప్రభుత్వమే సరిదిద్దుకోవాలని, కనుక నిరుద్యోగులకు ఉద్యోగ అర్హత వయో పరిమితి పెంచాలని డిమాండ్ చేశారు.

# హేమలతకు ఎస్ సీఈఆర్ టీ డైరెక్టర్ అభినందన



రాజాం (విజయభాను న్యూస్) : పట్టణంలో సారధి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని బి.హేమలతను ఎస్ సీఈఆర్ టీ స్టేట్ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి అభినందించి సత్కరించారు. ఆంగ్ల భాష క్లబ్ ను పాఠశాలలో ఏర్పాటుచేయడం, టీఎల్ఎమ్ తయారీచేయడం, 25 మంది విద్యార్థులను ఇన్నోవేషన్ కు ఎంపికచేయడం తదితర కార్యక్రమాలుతో ఆమెను అభినందించి ప్రశంసా పత్రాన్ని అందించినట్లు హెచ్ఎం మాధురి గురువారం మీడియాకు తెలిపారు. ఈకార్యక్రమం విజయవాడలో జరిగిందని అన్నారు. హేమలత ప్రతిభను హెచ్ఎంతో పాటు పాఠశాల ఇతర ఉపాధ్యాయినిలు అభినందించారు..

# జగన్మోహన్ రెడ్డికి ఒక్క ఛాన్స్ నిరుద్యోగులకు నో ఛాన్స్

## తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి



అల్లూరి జిల్లా..విజయభాను. న్యూస్.. పాడేరు.. : జగన్మోహన్ రెడ్డి పాలనలో ఉపాధి కల్పన నిల్ గంజాయి ఫుల్ గా ఉందని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గం ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి అన్నారు. గురువారం ఆమె తన స్వగృహంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తిగా వస్తున్న యువతకు ఒక్క ఉపాధి అవకాశం కల్పించిన దాఖలు లేవన్నారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగా యువత మాదకద్రవ్యాలకు బానిసలవతున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో (నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో)ప్రతీ ఏటా విడుదల చేసే వార్షిక నివేదిక ప్రకారం గంజాయి రవాణాలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో కొనసాగుతుందని అన్నారు. అధికారిక లెక్కల ప్రకారం 2021లో దేశ వ్యాప్తంగా సుమారు 7.5 లక్షల కిలోల గంజాయిని అధికారులు సీజ్ చేస్తే దానిలో రెండు లక్షలకు పైగా గంజాయి కేవలం ఆంధ్రప్రదేశ్ లోనే పట్టుబడిందని, దేశంలో పట్టుబడిన మొత్తం తో పోల్చితే ఇది సుమారు 26 శాతానికిపైగా ఉందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 2019లో 70,229 కేజీలు, 2020 లో 97,826 కేజీలు, 2021లో 2,00,588 కేజీలను అధికారులు సీజ్ చేశారని తెలిపారు. ప్రతిరోజు కొన్ని లక్షల టన్నుల గంజాయి ఆంధ్రప్రదేశ్ సరిహద్దులు దాటుతుంటే... తరలించే వారిపై మాత్రం కేవలం 1775 కేసులు మాత్రమే పెట్టారని, దీనిని బట్టి చూస్తే వైసీపీ నాయకులు గంజాయి మాఫీయాకు ఏవిధంగా సహకరిస్తున్నారో అర్థం అవుతుందని అన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో కార్మికుల దినోత్సవం



సబ్బవరం, విజయభాను న్యూస్ : మండల కేంద్రంలోని అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం పురస్కరించుకొని సోమవారం స్థానిక శ్రీ దుర్గమాంబ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయం ఆవరణలో కార్మికుల దినోత్సవ వేడుకలు జరిగాయి. భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు పూడి అప్పలనాయుడు పాల్గొనిమే డే జెండా పతాక ఆవిష్కరణ చేసారు. అనంతరం కార్మికు లందరికీ మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కులను హరించే మోడి నియంతృత్వపు పాలనపై మరో చికాగో పోరాటానికి సిద్ధం కావాలి అన్నారు నాడు బ్రిటీష్ బానిసత్వం పై 8 గంటల పని గూర్చి పోరాటం చేశారు నాడు పోరాటం చేసి సాధించి కున్న చట్టాన్ని నేడు మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా కార్మిక చట్టాన్ని రద్దు చేయు దలిచింది రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అదే బాటలో నడుస్తోంది అన్నారు.

కావున మేడే సభ సందర్భంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలి అన్నారు ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం సంఘం కోశాధికారి గొంప ముత్యాలనాయుడు ,జిల్లా కార్యదర్శి గొంతిన చంటి, ఎలూరి శ్రీను, చిన్నారావు, గోపి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# అద్దె వాహనాలను సద్వినియోగం చేసుకోండి - డీఆర్ఎం శతపతి



విశాఖపట్నం, విజయభాను న్యూస్ : విశాఖ రైల్వే స్టేషన్ కి వచ్చే ప్రయాణీకులు, పర్యాటకులు, ప్రజలు అద్దె వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని రైల్వే డివిజనల్ మేనేజర్ అనూప్ కుమార్ శతపతి కోరారు. రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ ఆవరణ లో రాధా కృష్ణ ఎంటర్ ప్రైజెస్ ఏర్పాటు చేసిన బైక్, కార్ రెంటల్స్ ను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కార్లు, బైకులు రోజు వారీ అద్దె ప్రాతిపదికన అందించడం అభినందనీయం అన్నారు. సంస్థ అధినేత నాయుడు మాట్లాడుతూ, రోజుకి బైక్ అయితే రూ.500, కారు అయితే రూ.2,500 వంతున అద్దె ఛార్జ్ చేస్తున్నాము అన్నారు.

విశాఖలో రోజురోజుకు పర్యాటకం అభివృద్ధి చెందుతున్న తరుణంలో అద్దె వాహనాలకు డిమాండ్ పెరిగింది అన్నారు. వినియోగదారులు ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వాల్సి వుంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, పలువురు రైల్వే అధికారులు పాల్గొన్నారు.


# ఎడిటర్ పరశురామ్ ను పరామర్శించిన ఏపీ ఎమ్మెస్ ఎమ్ఇ డిసి చైర్మన్ ఆనంద్ కుమార్ - సీఎం సహాయ నిధి ఇప్పిస్తానని హామీ



గాజువాక (విజయభాను న్యూస్) : ప్రజాస్వామ్య వ్యవస్థలో 4వ మూల స్తంభంగా ఉన్న మీడియాలో జర్నలిస్టు సంక్షేమానికి, సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న సామాజిక స్పృహ గల పరశురాముకు సీఎం సహాయ నిధినుండి సహకారం అందించేందుకు కృషి చేస్తానని ఏపీ ఎంఎస్ ఎంఈడిసి చైర్మన్ ఆనంద్ కుమార్ హామీ ఇచ్చారు.శుక్రవారం పారిశ్రామిక ప్రాంతం 62వ వార్డ్ దుర్గా నగర్ లో హెర్నియా శస్త్ర చికిత్స అనంతరం అతని స్వగృహంలోవిశ్రాంతి తీసుకుంటున్న పరశురామ్ ను కలిసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మీడియాతో ఆనంద్ మాట్లాడుతూ సమాజ ఉన్నతకి పాత్రికేయుల సంక్షేమానికి పరితపించే మీలాంటి ఎడిటర్, జర్నలిస్టుకు ప్రజాస్వామ్యంలో తోడ్పాటు అందించడం ఎంతైనా అవసరమని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు స్థానిక వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, ఆనంద్ కుమార్ పి ఏ సోమ నాయుడు, సీనియర్ నాయకులు బిశెట్టి గణేష్ , పశ్చిమ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్చార్జ్ బాబురావు, సూర్యనారాయణ, పలువురు వైసీపీ శ్రేణులు స్థానిక అభిమానులు, మహిళలు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

# 6న షిరిడీ సాయిబాబా లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవం



**విశాఖపట్నం, విజయభాను న్యూస్ :** స్థానిక మహారాణిపేట అంగడిదిబ్బలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం కార్యాలయ ఆవరణలో ఉన్న శ్రీశ్రీశ్రీ షిరిడి సాయిబాబా లక్ష్మీ గణపతి ఆలయం ప్రథమ వార్షికోత్సవ వేడుకలను శనివారం నేత్రపర్వముగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు జి. సత్యనారాయణ, కార్యదర్శి వై. సత్యనారాయణ, ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఒమ్మి కిషోర్ తెలియజేశారు. ఆ రోజు ఉదయం నుండి శ్రీ శ్రీ షిరిడి సాయిబాబాకు విశేష అర్చనలు, క్షీరాభి షకాలు, నారికేళ అభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహిస్తామని చెప్పారు.

# పారిశుద్ధ్య కార్మికులకు హెల్త్ కిట్ల పంపిణీ



గాజువాక (విజయభాను న్యూస్) : విధి నిర్వహణతో పాటు ఆరోగ్య పరిరక్షణ విషయంలో కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని 65 వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు జీవీఎంసీ కార్మికులకు సూచించారు. వార్డులోని రాజీవ్ ఇండోర్ స్టేడియం ఆవరణలోని బాపూజీ కోలనీ సచివాలయం వద్ద గురువారం పారిశుధ్య కార్మికులకు హెల్త్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు నిరంతరం పారిశుధ్య నిర్వహణ కోసం ఎంతో కృషి చేస్తున్నారని,సిబ్బంది చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు. ప్రజలు పరిశుభ్రమైన వాతావరణంలో ఆరోగ్య వంతమైన జీవితం గడిపేందుకు నిరంతరం పని చేస్తున్న కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని జీవీఎంసీ వారికి కొబ్బరినూనె,వర్క్ జాకెట్స్, ఇతర వస్తువులను అందజేస్తుంది అని తెలిపారు.

కార్మికులు ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు సూర్య ప్రకాశ్,అప్పలరాజు, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన అరకు ఎంపీ మాధవి దంపతులు



**కొయ్యూరు, విజయభాను న్యూస్ :** గురువారం విశాఖపట్నం నోవోటెల్‌లో జరిగిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండ రాజీవ్ గాంధీ నిశ్చితార్థ మహోత్సవ కార్యక్రమంలో అరకు ఎంపి గొడ్డేటి మాధవి, శివప్రసాద్ దంపతులు హాజరై కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# బాక్సింగ్ క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ




**ములగాడ, విజయభాను న్యూస్ :** మైక్ టైసన్ బాక్సింగ్ క్రీడాకారులకు సమ్మర్ కోచింగ్ క్యాంపులో భాగంగా శ్రీహరిపురం యమ్.ఐ.జి.క్రీడమైదానంలో గురువారం క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 61 వ వార్డ్ టీడీపీ అధ్యక్షుడు మాజ్జి సోమేశ్ పాల్గొని చిన్నారు లకు గుడ్లు, అరటిపండు,బిస్కెట్లు, మజ్జిగ, పంపిణి చేశారు.

క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి దేశానికీ పేరు తేవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ షైక్ అలీ, గణేష్,హరి, నవీన్,ప్రీమ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపనలు చేసిన పనులకే మళ్ళీ మళ్ళీ శంకుస్థాపనలా

## టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



భీమునిపట్నం, విజయ భాను న్యూస్ : గత ప్రభుత్వ హయాంలో శంకు స్థాపనలు చేసిన పనులకే మళ్ళీ శంకుస్థాపనలు చేసి రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టడంలో వై సి పి ప్రభుత్వం చాక చక్యం ఉన్నా దని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, గంటా నూకరాజు అన్నారు. బుధ వారం ఉత్తరాంధ్ర అభివృద్ధి పేరిటా చేసిన శంకుస్థాపనలు ప్రజలను మభ్యపెట్టి, గందరగోళానికి గురిచేసే విధంగా ఉందని అన్నారు. గురువారం గంటా నూకరాజు మాట్లాడుతూ. చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రిగా ఉండగా భోగాపురం విమానాశ్రయానికి, అదాని డేటా సెంటర్ కు శంకుస్థాపనలు చేసిన విషయం రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదని అన్నారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ పై గతంలో ఎన్నో కొర్రులు వేసిన మీరు నేడు శంకుస్థాపన ఎలా.? చేశారని అడిగారు. అధికారంలోకి వస్తే భోగాపురం ఎయిర్ పోర్ట్ కోసం ఇచ్చిన భూములు రైతులకు వెనక్కి ఇచ్చేస్తామని, భోగాపురం ఎయిర్ పోర్ట్ తయారయితే విశాఖ ఎయిర్ పోర్టులో ఈగలు తోలు కోవడమే అని చెప్పిన విషయం మర్చి పోయారా..? అని నిలదీశారు. ఐటీకి అంబాసిడర్ నారా చంద్రబాబు నాయుడని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హైదరాబాద్ అభివృద్ధి గాని, నవ్యాంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉండగా విశాఖలో ఐటీ హబ్ ఏర్పాటుకు గాని నాడు టి డి పి వేసిన బీజమని అన్నారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాతే విశాఖలో ఐటీ కంపెనీలు ఖాళీ అయిన సంగతి మర్చిపోకూడదని అన్నారు. విశాఖలో కాపురం పెడతానని ఉగాది, మే, సెప్టెంబర్ అని ఎలా వాయిదాలు వేసుకుంటూ వస్తున్నారో ఇది కూడా అంతే అని అన్నారు. . రాష్ట్రానికి ఈ నాలుగేళ్ల వైకాపా పాలనలో ఒక్క ఐటీ కంపెనీ కూడా రాలేదు, ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వ లేదు కానీ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో తలాతోక లేని ఈ హడావుడి శంకుస్థాపనలు ఎవరిని మభ్యపెట్టడానికని గంటా నూకరాజు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

విజయభాను

## సంపాదకీయం

### షరా మామూలే

ఖనిజాలు సహజ సంపదలు. అవి, ఏ దేశానికైనా దైవమిచ్చిన వరాలు. ఆ సిరిని సద్వినియోగపరిచిన పాలకులు తమ ప్రజలకు భాగ్యరాశులు సమకూర్చారుబీ స్వార్థానికి ఉపయోగించుకున్నవారు పాలితులకు కష్టాలనే మిగిల్చారు. మన దేశంలో ఛత్తీస్‌గఢ్, ఒడిషాలలోను, తెలుగు రాష్ట్రాలలోని కడప, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో అపార ఖనిజ నిక్షేపాలు ఉన్నాయి. అయినా అవి వెనుకబడిన ప్రాంతాలుగా ఉన్నాయి! పాలకుల దక్షత కారణాన గల్ఫ్ దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసించే స్థాయికి ఎదిగాయి. ఆఫ్రికాలోని అనేక దేశాలలో విలువైన వజ్రాలు, బంగారం, చమురు సహా విభిన్న సహజ వనరులు ఉన్నాయి. అయితే దేశాలన్నీ కూడ నిరంతరం వివిధ తెగల అంతర్యుద్ధాలతో నిమగ్నమై ఉంటాయి. ఆఫ్రికన్ దేశమైన సూడాన్‌లో బంగారం నిక్షేపాలు అపారంగా ఉన్నాయి. ఈ బంగారం గనులపై ఆధిపత్యానికై సూడాన్ సైన్యంలోని ఒక వర్గం చేసిన తిరుగుబాటే ఆ దేశంలోని ప్రస్తుత అస్థిర పరిస్థితులకు ఒక ప్రధాన కారణం.

ఆఫ్రికా దేశాలలో సంప్రదాయకంగా కొన్ని తెగలతో కూడిన సాయుధులు పాలకుడికి అత్యంత విధేయతగా ఉంటారు. సూడాన్‌లో సైతం, ఆ దేశాన్ని సుదీర్ఘంగా పరిపాలించిన జనరల్ ఉమర్ బషీర్‌కు అనుకూలంగా జంజవీద్ తెగలకు చెందిన సాయుధులు ఉన్నారు. వీరు ఇటీవలి తిరుగుబాటును అణిచివేస్తూ బషీర్ సైన్యానికి సహకరించారు. ప్రస్తుతం ఆర్.యస్.యఫ్‌గా పిలువబడుతున్న ఈ సాయుధులు 25 లక్షల మంది పౌరులను తరిమికొట్టి, మరో 3 లక్షల మందిని హతమార్చారు.

ఈ నరమేధానికి ఉమర్ బషీరే బాధ్యుడని అంతర్జాతీయ న్యాయస్థానం ప్రకటించింది. అరెస్ట్ వారెంట్ జారీ చేసింది కూడ. న్యూఢిల్లీలో మోదీ సర్కార్ నిర్వహించిన ఆఫ్రికా సదస్సులో పాల్గొన్న ప్రముఖులలో బషీర్ ఒకడు. అరెస్ట్ వారెంట్లతో తమకు సంబంధం లేదని, ఒక దేశాధినేతగా బషీర్ తమకు అతిథి అని మోదీ సర్కార్ తన వైఖరిని స్పష్టం చేసింది. అతడికి రాచమర్యాదలు చేసింది. ఆ తర్వాత ప్రజా తిరుగుబాటుతో బషీర్ తన అధికారం కోల్పోయినా ఆయనకు విధేయులుగా పని చేసిన జంజవీద్ తెగ సాయుధులతో పాటు సైనికులకు అధికారం దక్కింది. అధికారిక సైన్యానికి జంజవీద్ తెగల సాయుధులకు మధ్య జరుగుతున్న అధిపత్య పోరు తీవ్ర రూపం దాల్చింది. బంగారం వెలికితీతతో వచ్చిన ఆదాయంతో జంజవీద్ తెగ సాయుధులు ఏకంగా సైన్యానికి సవాల్ విసిరే స్థాయికి ఎదిగారు. సైన్యం వద్ద వాయుసేన, నౌకా దళాలు ఉండగా దేశంలోని దాదాపు భూభాగమంతా కూడా ఈ ఆర్.యస్.యఫ్ చేతిలో ఉంది.

సూడాన్‌లో సుమారు నాలుగు వేల మంది భారతీయులు ఉన్నారు. వీరిలో అత్యధికులు గుజరాతీలే అని మరి చెప్పనవసరం లేదు. సాధారణంగా ఆఫ్రికా దేశాలన్నిటా గుజరాతీలు ఎక్కువ సంఖ్యలో ఉండడం కద్దు. సూడాన్‌లో తెలుగు ప్రవాసులు ఇంచుమించు నాలుగు వందల మంది దాకా ఉంటారు. వీరిలో అత్యధికులు ఉభయ గోదావరి జిల్లాలకు చెందినవారే. వీరిలో పలువురు గల్ఫ్ దేశాలలో పనిచేసి ఇంకా అధిక వేతనాల కొరకు సూడాన్‌కు వెళ్ళిన వారున్నారు. తెలుగు రాష్ట్రాల ప్రముఖ రాజకీయ నాయకులకు చెందిన కాంట్రాక్టింగ్ సంస్థలు కూడ సూడాన్‌లో ఉన్నాయి. తెలుగు వాళ్ళు కొందరు పని చేస్తున్న సూడానీస్ ప్రాంతాలలో ఎలాంటి ఉద్రిక్తతలు, దాడులు లేవు. అయితే సరఫరాలు లేక క్రమేణా దుకాణాలు మూతపడుతున్నాయి. విద్యుత్, టెలిఫోన్ వ్యవస్థలకు అంతరాయం ఏర్పడింది. మున్ముందు సరఫరాలకు పూర్తి విఘాతం ఏర్పడితే ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందనే భయంతో వారు స్వదేశానికి తిరిగి వెళ్తున్నారు. మరికొందరు, ప్రత్యేకించి బాంబుల దాడులు తీవ్రంగా ఉన్న రాజధాని ఖార్తోంలో ఉన్న తెలుగు ప్రవాసులు ప్రాణాలను కాపాడుకోవడానికై స్వదేశానికి వెళ్తున్నారు. సూడాన్ మహిళలను వివాహం చేసుకున్న హైదరాబాద్ నగర ముస్లింలు ఆ దేశంలోనే స్థిరపడ్డారు.

సంక్షోభంలో చిక్కుకున్న భారతీయులను సౌదీ అరేబియాకు తరలించి అక్కడి నుంచి భారతదేశానికి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 'మిషన్ కావేరి'ని ప్రారంభించింది. సౌదీ అరేబియా, అమెరికా దేశాలు సూడాన్‌లోని ఇరువర్గాలతో తాత్కాలికంగా కుదిర్చిన కాల్పుల విరమణతో ఈ తరలింపు కార్యక్రమం సులువయింది. ప్రధాని నరేంద్ర మోదీకి సౌదీ అరేబియా యువరాజుతో ఉన్న సంబంధాలు కూడ ఇందుకు తోడ్పడ్డాయి. 'మిషన్ కావేరి'ని మోదీ ప్రభుత్వం విజయవంతంగా కొనసాగిస్తుండడం అభినందనీయం. కర్ణాటకలో సిద్ధరామయ్య, కాంగ్రెస్‌కు వీర విధేయులుగా ఉన్న హక్కి పిక్కి అనే తెగకు చెందిన చాల మంది గిరిజనులు సూడాన్‌లో మూలికలు విక్రయిస్తుంటారు. కర్ణాటక ఎన్నికల దృష్ట్యా అక్కడి ప్రధాన నది అయిన కావేరి పేరుతో ఆ కార్యక్రమానికి నామకరణం చేసారనే విమర్శ కూడా ఉంది. ఇక, సూడాన్ నుంచి రోజూ వచ్చే ప్రతి ఒక్క భారతీయ బృందానికి న్యూఢిల్లీలో విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి మురళీధరన్ స్వాగతం పలుకుతున్నారు. దీనికి సంబంధించిన ఫోటోలు రోజూ మీడియాలో రావడం కూడా రాజకీయంగా షరా మామూలే.

# వెనుకబడిన ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం

- సీతంపేట శ్రీవారి ఆలయంలో భక్తులకు దర్శనం ప్రారంభం
- శుభకార్యాల కోసం గిరిజనులకు ఉచితంగా కల్యాణ మండపం
- కురుపాంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి చర్యలు
- టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వైవి.సుబ్బారెడ్డి
- సీతంపేటలో ఆగమోక్తంగా శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయ మహాసంప్రోక్షణ



సీతంపేట (విజయభాను న్యూస్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ధర్మ ప్రచారంలో భాగంగా గిరిజన, మత్స్యకార, దళితవాడలు ఇతర వెనుకబడిన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆలయాల నిర్మాణం చేపడుతున్నామని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో టిటిడి నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ మహాసంప్రోక్షణ గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వైవి.సుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి తిరుమలకు విచ్చేసి స్వామివారిని దర్శించుకోలేని భక్తుల కోసం గడిచిన నాలుగేళ్లలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని వెనుకబడిన ప్రాంతాల్లో సుమారు 2 వేల ఆలయాల నిర్మాణానికి చర్యలు చేపట్టామని తెలిపారు. సీతంపేటలో ఒకటిన్నర సంవత్సరాల అతి తక్కువ వ్యవధిలో దాదాపు రూ.10 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టామని చెప్పారు. ఆలయం వద్ద నిర్మించిన కల్యాణ మండపాన్ని మరింతగా విస్తరించి, చుట్టుపక్కల గిరిజన భక్తులు ఉచితంగా శుభకార్యాలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. మరో గిరిజన ప్రాంతమైన రంపచోడవరంలో ఈనెల 17 నుంచి 22వ తేదీ వరకు నూతన ఆలయం మహా సంప్రోక్షణ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతమైన కురుపాంలో శ్రీవారి ఆలయాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



గిరిజనులకు రవాణా, వసతి, ఆహారం ఉచితంగా కల్పించి తిరుమల బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ద్వార దర్శనం ఉచితంగా చేయిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతాల నుంచి స్వామివారి మీద అచంచలమైన భక్తి విశ్వాసాలతో వేలాది మంది శ్రీవారి సేవకులు తిరుమలకు విచ్చేసి తోటి భక్తులకు సేవ చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. వీరందరికీ స్వామివారి ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకుంటున్నానని, రాబోయే రోజుల్లో ఈ ప్రాంతాల నుండి మరింతమంది శ్రీవారి సేవకులుగా భక్తులకు సేవలు అందించాలని కోరారు.

**ఆగమోక్తంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ మహాసంప్రోక్షణ.....**

ఈ సందర్భంగా ఉదయం యాగశాలలో మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఆ తరువాత కుంభ ప్రదక్షిణ చేశారు. ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్య వృషభ లగ్నంలో మహాసంప్రోక్షణ, కళావాహన చేపట్టారు. ఈ క్రతువుల ద్వారా యాగశాలలోని కలశాలలో ఇమిడి ఉన్న దేవతాశక్తిని శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ పద్మావతి అమ్మవారు, శ్రీ గోదాదేవి, శ్రీ గరుడాళ్వార్, ద్వారపాలకుల విగ్రహాల్లోకి ఆవాహన చేశారు. అనంతరం అక్షతారోపణ, బ్రహ్మఘోష, ఆచార్య బహుమానం అందించారు.

**భక్తులకు దర్శనం ప్రారంభం....**

మహాసంప్రోక్షణ కార్యక్రమం అనంతరం ఉదయం 10 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం ప్రారంభమైంది. సీతంపేట చుట్టుపక్కల ప్రాంతాల నుంచి విశేషంగా భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. విచ్చేసిన భక్తులందరికీ అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

**శ్రీవారి సేవకుల విశేష సేవలు....**

సీతంపేట ఆలయ మహాసంప్రోక్షణ సందర్భంగా ఆరు రోజులపాటు నిర్వహించిన కార్యక్రమాల్లో శ్రీవారి సేవకులు విశేష సేవలు అందించారు. భక్తులకు తాగునీరు, అన్నప్రసాదాల పంపిణీ, ఆలయానికి అవసరమైన పూలు కట్టడం తదితర సేవలు అందించారు. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల నుంచి దాదాపు 600 మంది శ్రీవారి సేవకులు భక్తులకు సేవలు అందించారు.

ఈ కార్యక్రమంలో ఎంపి చంద్రశేఖర్, జెఈవో వీరబ్రహ్మం, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు వి.కళావతి, పుష్పశ్రీవాణి, రెడ్డిశాంతి, కంబాల జోగులు, చిన్న అప్పలనాయుడు, టీటీడీ బోర్డు సభ్యులు మల్లాది కృష్ణారావు, ఐటీడీఏ పీవో కుమారి కల్పనా కుమారి, సబ్ కలెక్టర్ నూరుల్ కోమర్, జిసిసి ఎండి సురేష్ కుమార్, తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలదీక్షితులు, టిటిడి వైఖానస ఆగమసలహాదారు మోహనరంగాచార్యులు, కంకణభట్టార్ శేషాచార్యులు, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఇలు టివి.సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, విజివో మనోహర్, డెప్యూటీ ఈవోలు గుణభూషణ్ రెడ్డి, వెంకటయ్య, శివప్రసాద్, ఇఇ సుధాకర్, ఏఈఓ రమేష్, డెప్యూటీ ఇఇలు ఆనందరావు, నాగరాజు, జెఈ రవికుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న భజన, కోలాట కార్యక్రమాలు...**

సీతంపేటలోని ఆలయం వద్ద గల వేదికపై టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. గిరిజన ప్రాంతాల నుంచి భజన బృందాలు కళారూపాలను ప్రదర్శిస్తున్నారు. వైజాగ్ కు చెందిన కిరణ్మయి బృందం చక్కగా భరతనాట్య ప్రదర్శన చేశారు. అదేవిధంగా బొబ్బిలికి చెందిన శ్రీ వేంకటేశ్వర కోలాట నృత్య భజన బృందం, కొత్తూరుకు చెందిన శ్రీహరే శ్రీనివాసా కోలాట నృత్య బృందం, నరసన్నపేటకు చెందిన శ్రీ లక్ష్మీ నరసింహ కోలాట నృత్య భజన బృందం, పార్వతీపురానికి చెందిన శ్రీ పాద కోలాట నృత్య భజన బృందం కోలాట ప్రదర్శన చేశారు. సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వర శర్మ, ప్రోగ్రాం అసిస్టెంట్ లలితామణి ఈ కార్యక్రమాల ఏర్పాట్లను పర్యవేక్షించారు.



# "సమ్మర్ కార్నివల్" పేరుతో ఫుడ్ ఫెస్టివల్





విశాఖపట్నం (విజయభాను న్యూస్) : నగరంలోని సిరిపురం వి.ఐ.పి. రోడ్ హోటల్ మంత్రిస్లో వేసవి సెలవులు సందర్భంగా "సమ్మర్ కార్నివల్" పేరుతో ఫుడ్ ఫెస్టివల్ జరుగుతోంది. ఈ ఫుడ్ ఫెస్టివల్ నేటినుండి అనగా మే 3 నుండి మే 21 వరకు కొనసాగుతోంది. వివిధ రకాల ఆహార పదార్థాలతో 18 రోజుల పాటు రాత్రి 7.00 గంటలనుండి 10.30 గంటల వరకు ఈ ఫుడ్ ఫెస్టివల్ ఉంటుందని హోటల్ ఎఫ్ అండ్ బి మేనేజర్ శ్యామ్ కుమార్ తెలిపారు. పేరెంట్స్ తమ పిల్లల్ని ఇక్కడికి తీసుకువచ్చి ఫుడ్ తింటూ ఎంజాయ్ చేయొచ్చని, పిల్లల్ని ఆకర్షించేందుకు పలు రకాల గేమ్స్, వినోద కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారని హోటల్ యాజమాన్యం తెలిపారు.





# భూ ఆక్రమణలకు పాల్పడుతున్న మాజీ రౌడీ షీటర్ దొడ్డి రమణ పై చర్యలు చేపట్టాలి

-దళిత బహుజన మహిళా సంఘం సభ్యులు డిమాండ్



గాజువాక (విజయభాను న్యూస్ ): జీవీఎంసీ 65వ వార్డ్ సర్వే నెంబర్ 274లో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం పేరు చెప్పి భూ కబ్జాలకు పాల్పడుతున్న మాజీ రౌడీషీటర్ దొడ్డి రమణ మంత్రి మంజుల వారి అనుచరులపై తక్షణమే ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేయాలని దళిత బహుజన మహిళా సంఘం సభ్యులు డిమాండ్ చేసారు. 65వ వార్డ్ వాంబే కాలనీ వద్ద గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం అధ్యక్షురాలు రట్టి జయమ్మ మాట్లాడుతూ దేవుడు పేరు తో భూ ఆక్రమణలకు పాల్పడుతున్న వారిని తక్షణమే జిల్లా కలెక్టర్, మండల రెవెన్యూ అధికారులు చట్ట పరమైన చర్యలు చేపట్టి ప్రభుత్వ భూములను కాపాడాలని అన్నారు.

అలాగే కేఎల్ నగర్ సర్వే నెంబర్ 17,18 లో మాజీ ఎమ్మెల్యే గురుమూర్తి రెడ్డి ఇంటి వెనకాల ఉన్న మంత్రి మంజుల కుమార్తె సిరగడ్ల శిరీష పేరునున్న 600 గజాలు అక్రమనకు గురైందని, సర్వే నంబర్ 86 లో స్వయాన తన కుమారు డైనటువంటి అత్తగారి పేరున లంకాడ సత్యవతి పేరున 900 గజాలు కబ్జా చేయడం జరిగిందని వీరి కబ్జాలపై తక్షణమే ఉన్నత అధికారులు విచారణ జరిపి వాస్తవాన్ని బయటపెట్టి వీరి కబ్జాలకి అడ్డుకట్టు వేసి తక్షణమే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేసారు. పెదగంట్యాడ ఎమ్మార్వో ,స్థానిక సచివాలయం వారు 274లో గల వెంకటేశ్వర స్వామి ఆలయం వెనకాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి కట్టిన ఆరు ఇళ్లను పరిశీలించి విచారణ జరిపి, విధి నిర్వహణలో భాగంలో వారి అక్రమాలను గుర్తించి వాటిని తొలగించి అడ్డుకట్ట వేయడం హర్షనీయమని అన్నారు.

350 మంది ఒక సంఘంగా ఏర్పడి ఎన్నో పోరాట ఉద్యమాలు ప్రాణ త్యాగానికి సిద్ధమై దళిత బహుజన మహిళా సంఘం ద్వారా 27 బ్లాకులు లో 672 గృహాలు సాధించుకోవడం జరిగిందని, అధికారుల సమక్షంలో కుల మతాలకు అతీతంగా వాంబే కాలనీకి సంబంధించి స్థానిక అన్ని పార్టీ వాళ్ళని కాలనీ వాసులందరినీ

కలుపుకొని ఒక కమిటీ ఏర్పాటు చేసి వారు చేస్తున్న అక్రమ వసూళ్లు భూ దందాలకు చరమగీత పాడాలి అని దళిత బహుజన మహిళ సంఘం అధ్యక్షురాలు రట్టి జయమ్మ కోరారు. మీడియా సమావేశంలో సంఘం సభ్యులు మోయ లక్ష్మి,సింహాచలం,

ముడిసి బావానమ్మ,బి శాంతి,ఎం లక్ష్మి,కే రమణమ్మ,65వ వార్డ్ టిడిపి అధ్యక్షుడు రట్టి వాసు,దార విజయ్,అర్ సంతోష్ వాంబే కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విశ్వవిద్యాలయం మన్యం జిల్లాలో ఏర్పాటే సమంజసం

పార్వతీపురం, : విభజన హామీల్లో భాగంగా మంజూరైన గిరిజన విశ్వ విద్యా లయం పార్వతీపురం మన్యం జిల్లాలో ఏర్పాటు చేయడమే సమం జసమని మాజీ ఎమ్మెల్సీలు శత్రు చర్ల విజయరామరాజు, ద్వారపురెడ్డి జగదీశ్ అన్నారు. పార్వతీపురం లోని పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లాకు మన్యం పేరు సార్థకత కావాలంటే ఇక్కడే విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. విభజన జరిగి ఇన్నేళ్లయినా ఇప్పటికీ ఏర్పాటుపై ప్రభుత్వానికి స్పష్టత లేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా నిర్ణయాన్ని ప్రకటించాలని డిమాండు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'సెమిక్రాక్' ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. గతంలోనే విమానాశ్రయానికి శంకుస్థాపన జరిగిన విషయాన్ని గుర్తు చేస్తూ.. నిర్మాణానికి ఆర్థిక వనరులపై ప్రభుత్వం మాట్లాడడం లేదన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే 2019లో అధికారానికి వచ్చిన వెంటనే ఈ పని చేయాల్సిందని తెలిపారు. తారకరామతీర్థసాగర్ పథకానికి మళ్లీ శంకుస్థాపన చేయడం సిగ్గుచేటన్నారు. ఇవన్నీ ప్రజల కళ్లకు గంతలు కట్టడానికేనని విమర్శించారు. సమావేశంలో జి.ఉదయ భాను, ఎన్.కృష్ణబాబు, కె.వెంకటరావు, ఎం.కృష్ణమోహన్, పి.వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ రవాణాను ఆరికట్టాలి

శ్రీకాకుళం, : జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో విభాగం పనితీరు సంతృప్తికరంగా ఉందని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక పేర్కొన్నారు. మెరుగైన ప్రతిభ కనబరిచి అక్రమ రవాణాను అరికట్టాలని ఎస్పి సూచించారు. జిల్లా ఎస్పీ రాధిక అధ్యక్షతన గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగం అధికారులతో నెల వారి నేర సమీక్షా సమావేశంను నిర్వహించారు.ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో విభాగము బాధ్యతగా పనిచేసి పెండిగులో ఉన్న కేసులను చేదించాలని ఎస్పీ తెలిపారు.

# జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి అనూహ్య స్పందన



సబ్బవరం, విజయభాను న్యూస్ : జగనన్నే మా భవిష్యత్–మానమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా అనూహ్య స్పందన లభించిందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. మండలంలోని వైసీపీ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7 నుండి 29 వరకు నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో సుమారు 7 లక్షల మంది క్రియాశీలక కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి 45 లక్షల కుటుంబాలను వైసీపీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో నేరుగా కలిసారని, కోటి10 లక్షలు మిస్డ్ కాల్స్ ముఖ్యమంత్రి కి మద్దతుగా వచ్చాయన్నారు. మళ్ళీ రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో వైసీపీ నేతలు, కార్యకర్తలు చిత్తశుద్ధితో, నిబద్ధతతో ఈ కార్యక్రమానికి విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పెందుర్తి నియోజకవర్గంలో 91,166 గృహాలు ఉండగా 76,823 మంది తమకు మద్దతు పలికారని, 84.27శాతం పూర్తి చేశామని, మిగిలిన వాటిని త్వరలో పూర్తి చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో వైసీపీ ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉందనడానికి ఇదే నిదర్శన మన్నారు. తమ ప్రభుత్వం అభివృద్ధి, సంకేమానికి కట్టుబడి ఉందన్నారు. 2014-19 లో టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి మళ్ళీ తమకు ఓటేయలని చంద్రబాబు నాయుడు ప్రజల్లోకి రావాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో జెడ్ పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, ఎంపీపీ బోకం సూర్యకుమారి రాము నాయుడు, వైసీపీ నేతలు కోటాన రాము, సబ్బవరపు ముత్యాలనాయుడు, వెన్నల సన్యాసిరావు, గొర్లి ఉమా మహేశ్వర రావు, వడ్డాది అప్పలరాజు, పాలిశెట్టి సురేష్, యడ్ల నాయుడు, బోను నాయుడు, నేబర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా బ్రాహ్మణి ముత్యాలమ్మతల్లి జాతర



పరవాడ (విజయభాను న్యూస్) : అనకాపల్లిజిల్లా మండల కేంద్రం పరవాడ శివాలయం రోడ్డులో కొలువు తీరిన శ్రీ బ్రాహ్మణి ముత్యాలమ్మతల్లి జాతర గురువారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పరవాడ మండల పరిషత్ అధ్యక్షులు పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు ముత్యాలమ్మ తల్లిని దర్శించుకుని పసుపు కుంకుమలు, చీరెసారెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం జాతర సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద దాతల సహాయంతో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనను ప్రారంభించారు. సాయంత్రం కోలాట నృత్యాలు, డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యాలతో అమ్మవారి అనుపు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, 79 వ వార్డు నాయకులు కాసు అంజిరెడ్డి, ఉప సర్పంచి బండారు రామారావు, వైకాపా నాయకులు పైల జూనియర్ అప్పలనాయుడు, చల్లా కనకారావు, జేసిఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, విశాఖ వైకాపా పార్లమెంటరీ జనరల్ సెక్రటరీ గండి జ్యోతి, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, చీపురుపల్లి సన్యాసిరావు, పైల అప్పలనాయుడు, వర్రి హరి, రాజాన సత్యం, ఉత్సవ కమిటీ పెద్దలు, యూత్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడీ ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేత



రాజాం (విజయభాను న్యూస్) : స్థానిక వైఎస్ఆర్సీపీ కార్యాలయం వద్ద గురువారం రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు రాజాం మండలంలో సీతంపేట అంగన్వాడీ కేంద్రం ఆశా వర్కరు, గెడ్డవలస గ్రామ అంగన్వాడీ కేంద్రం అంగన్వాడీ ఆయా, సంతకవిటి మండలం గుజ్జన్నపేట అంగన్వాడీ కేంద్రం ఆయా పోష్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు.

ఈ కార్యక్రమంలో రాజాం ఎంపీపీ లావేటి రాజ గోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, ఐసీడీఎస్ సీడీపీఓ డాక్టర్ కనకదుర్గ, సిమ్మాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గురుస్వామి ఆకెళ్ళ నరసింహమూర్తి మృతికి పలువురు సంతాపం



భీమునిపట్నం, విజయభాను న్యూస్ : గురుస్వామి ఆకెళ్ల నరసింహమూర్తి అకాల మృతి చెందడం పట్ల పలువురు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన అకస్మాత్తుగా మృతి చెందడం చాలా బాధాకరం,

ఆయన మంచికి మారుపేరు, చాలా మంది కి ఆశాజ్యోతి, ఆయన తిరిగిరాని లోకానికి వెళ్లి చాలామంది భక్తుల్లో బాధను మిగిల్చి, ఆ బాధను చాలామంది దిగమింగు కోలేక పోతున్నారనీ అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగ వంతుని కోరుకుంటున్నామని...

పలువురు సంతాపం వ్యక్తం చేశారు. చిట్టివలస జూట్ మిల్లు కాంగ్రెస్ కార్మిక సంఘం నాయకులు జె.వి కైలాస్ రెడ్డి, దల్లి అప్పల రెడ్డి, ఎం.ఆదినారాయణ రెడ్డి, వైకాపా నాయకులు గాడు శ్రీను, సిఐటియు నాయకులు ఎస్.అప్పల నాయుడు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

# మే 7న అల్లూరి శతవర్ధంతి కార్యక్రమాలు



**కొయ్యూరు, విజయభాను న్యూస్ :** కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం, మంప గ్రామాలలో అల్లూరి స్మృతి మందిరలలో మే 7న అల్లూరి శతవర్ధంతి కార్యక్రమాలు నిర్వహించనున్నామని బిజెపి మండల శాఖ అధ్యక్షులు మురుకుర్తి అప్పలరాజు, బిజెపి గిరిజన మోర్చా జిల్లా వైస్ ప్రెసిడెంట్ చంద్రరావు, గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అరిమెల రాజు, మండల కోశాధి కారి సంపరి శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివిఎన్.మాధవ్, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లా ప్రముఖులు ముఖ్య అధితిలుగా హాజరు కానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో 200 బైక్లు ర్యాలీ నిర్వహించాలని మండల శాఖ తీర్మానం చేయడం జరిగిందన్నారు. దివంగత నేత లోకుల గాంధీ కృషి ఫలితంగా రాజేంద్రపాలెం, మంప అల్లూరి నడయాడిన ప్రాంతలలో కోటి రూపాయలు వ్యయంతో అభివృద్ధి పనులు జరిగినట్లుగా ఈ సందర్భంగా ప్రజలు గుర్తించాలని, రానున్న కాలంలో ఇంకా ఈ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం సహాయం తీసుకోని ముందుకు వెళ్తామన్నారు.

కావున అల్లూరి అభిమానులుఅందరు కార్యక్రమాన్ని జయప్రదం చేసి సీతారామరాజుకి ఘన నివాళ్లు అర్పించాలని కోరారు.

# అంబేరుపురంలో ఘనంగా ముత్యమాంబ అమ్మవారి పండుగ మహోత్సవం



ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



అంబేరుపురం ముత్యమాంబ అమ్మవారు

చోడవరం (విజయభాను న్యూస్) : మండలంలోని అంబేరుపురం గ్రామ ప్రజల ఆరాధ్య దేవత ముత్యమాంబ అమ్మవారి పండుగ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉత్సవ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ వేగి శ్రీనివాసరావు, వేగి ముత్యాల నాయుడు, గ్రామ పెద్దలు, ప్రజలు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండి భారీ సంఖ్యలో భక్తుల తో ఆలయం కిటకిటలాడింది. భక్తులు భారీ ఊరేగింపుగా వెళ్లి పసుపు కుంకుమ, చీర సారీలు సమర్పించి, ధూప దీప నైవేద్యాలతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో ప్రసాద్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం అమ్మవారి అగ్నిగుండం ఉత్సవం, అనంతరం అమ్మవారి ఊరేగింపు కార్య క్రమాన్ని నిర్వహించారు.

రాత్రి నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గ్రామ ప్రజలతో పాటు, పరిసర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ దుర్గాలమ్మ తల్లి అమ్మవారి పండగ అనుపు మహోత్సవం



సబ్బవరం (విజయభాను న్యూస్) : మండల కేంద్రంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ ఐదు గ్రామాల ప్రజలు ఆరాధ్యదైమైన శ్రీ దుర్గాలమ్మ తల్లి అమ్మవారి పండగ అనుపు మహోత్సవం ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా నిర్వహించారు. మంగళవారం ఉదయం 6 గంటల నుండి అమ్మవారికి ధూప, దీప, నైవేద్యాలతో, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో అమ్మవారికి తమ, తమ మొక్కులు పసుపు, కుంకుమ, చీరలు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు గ్రామ పెద్దలు భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. అలాగే సాయంత్రం చిరతలు , కోలాటాలు, డిజె సౌండ్స్ తో , అమ్మవారి వేషాలతో, మందుగుండు సామగ్రి తో అమ్మవారి ఘటాల భారీ ఊరేగింపు తో అనుపు మహోత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 గంటల నుండి భారీ స్టేజ్ ప్రోగ్రాం డాన్స్ బేబీ డాన్స్ సంస్కృతక కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో , అనకాపల్లి జిల్లా టిడిపి యువత అధ్యక్షుడు పి బివి ఎస్ ఎన్ రాజు (బుచ్చిరాజు), గ్రామ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు , మండల టిడిపి కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు, గుడ్ల నాని, చింతల జగన్నాధ రావు , డి నాని, బర్ల రమణ, గెద్దం సూర్యనారాయణ, త్రినాధ్, ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, భక్తులు ,తదితరులు పాల్గొన్నారు.

# రాజాంలో గడపగడపకు మన ప్రభుత్వం



రాజాం (విజయభాను న్యూస్) : పట్టణంలో శ్రీనివాసాకాలనీ, కురాకుల వీధి, అగ్రహారం వీధి, నెయ్యిలవీధి, తాణావీధి, సాయిబులవీధి, ఆశపువీధి, చిన్నచెరువు గట్టు ప్రాంతాల్లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. కరపత్రాలు పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, వంజరాపు విజయ్ కుమార్, మున్సిపల్ కమిషినర్ డీటీవీ కృష్ణారావు, మెప్మా టీఎంసీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

# నాగాభట్ల కామేశ్వర శర్మ కు ఘన సన్మానం



అన్నవరం (విజయభాను న్యూస్) : శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవ స్థానంలో సుదీర్ఘకాలం వ్రత పురోహి తునిగా, స్పెషల్ గ్రేడ్ వ్రత పురోహితునిగా, కల్యాణ బ్రహ్మగా, వైదిక కార్యక్రమాల పర్య వేక్షకులుగా వివిధ పదవులు అలంకరించిన నాగాభట్ల కామేశ్వర శర్మ ఉద్యోగ విరమణ అనంతరం యావన్మంది వ్రత పురోహితులు, ఆయన శిష్య బృందం ఘనంగా సన్మానించారు. స్థానిక శ్రీ సత్యదేవ బ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రం లో స్వాగతం పలికి కామేశ్వర శర్మ దంపతులకు పాద పూజ చేసి , అనంతరం "స్వర్ణ గండ పెండేరం తొడిగి స్మార్త శిఖామణి బిరుదు తో ఘనంగా సత్కరించారు". ఈ సందర్భంగా వక్తలు కామేశ్వర శర్మ చేసినటువంటి మంచి పనులు, వ్రత పురోహితులకు సంబంధించి ఆయనతో ఉన్న అనుబంధం గురించి ప్రవచించారు.

ఈ కార్యక్రమంలో...

వేద పండితులు, వ్రత పురోహితులు, గ్రామ సర్పంచ్ కుమార్ రాజా, గ్రామంలో ప్రముఖులు పాల్గొన్నారు.

## యాక్సిడెంట్ లో గాయపడిన క్షతగాత్రులను జిల్లా హాస్పిటల్ కు వెళ్లి పరామర్శ

### మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ ను కోరిన మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్



అల్లూరిజిల్లా. విజయభాను.న్యూస్.. పెద బయలు మండలం కిముడుపల్లి పంచాయితీ పులుగొంది గ్రామంలో ఆటో బోల్తా పడి తొమ్మిది మంది క్షతగాత్రులకు గాయపడి హుటాహుటిన పాడేరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిసి తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ ఇంచార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను జరిగిన పరిస్థితులను అడిగి పరామర్శించి డాక్టర్ కు చికిత్స పొందుతున్న వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు డాక్టర్ మాట్లాడుతూ ఎటువంటి ఇబ్బంది లేదని కొన్ని రోజులు వైద్యం తీసుకుని విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని అన్నారు క్షతగాత్రులను దైర్యంగా ఉండాలని ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలనీ మెరుగైన వైద్యం అందించాలని ఏ సమస్య లేకుండా తీసుకోవాలని డాక్టర్ ను సూచించారు క్షతగాత్రులను వారి కుటుంబ సభ్యులను అండగా ఉంటానని మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ భరోసా ఇచ్చారు మాజీ మంత్రి వెంట దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, టీడీపీ నాయకులు బాబురావు, త్రినాథ్,మురళి,రాజు, మితాయి,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు..



## బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్లకు సర్పంచ్ కిల్లో మోస్య శంకుస్థాపన



అనంతగిరి విజయభాను న్యూస్ : అనంతగిరి.. టోకూరు పంచాయతీ చిట్టం పాడు బొరిబొరివలస గ్రామాల్లో గురువారం బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్లకు సర్పంచ్ కిల్లో మోస్య, శంకుస్థాపన. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టవర్లు నిర్మాణం తో టోకూరు పంచాయతీ అని గ్రామంలో కమ్యునికేషన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు ఇప్పటికే చిట్టం పాడు వాటర్ ఫాల్స్ అభివృద్ధి చెందుతుందని చిట్టం పాడు గ్రామంలో టవర్ నిర్మాణం వలన వాటర్ ఫాల్స్ కు వచ్చే పర్యాటకులకు సెల్ సిగ్నల్ మరింత సులభంగా అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గెమ్మెల నర్సన్న టోకూరు ఎంపిటిసి సభ్యులు భర్త సార జగన్నాథం వార్డు సభ్యులు రామూర్తి చంద్రన్న వాటర్ ఫాల్స్ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మజ్జి అప్పన్న కార్యదర్శి లక్ష్మణ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

### సత్యదేవుని హుండీల లెక్కింపు ఆదాయం 37 రోజులకు రూ.1.74 కోట్లు.

అన్నవరం (విజయభానున న్యూస్) : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం తాలూకా హుండీల లెక్కింపు ను కోవిడ్ నిబంధనలు పాటిస్తూ గురువారం నిర్వహించారు.గడచిన 37 రోజులకు గాను సత్యదేవుని హుండీల లెక్కింపు ఆదాయం రూ.1,74,78,040/-(ఒక్క కోటి,డభై నాలుగు లక్షల,డభై ఎనిమిది వేల,నలభై రూపాయలు) రాగా బంగారం 280 గ్రాములు,వెండి 1 కేజీ లభ్యం కాగా విదేశీ కరెన్సీ యుయస్ఏ128 డాలర్లు,కెనడా 25 డాలర్లు తో పాటు మరికొంత విదేశీ కరెన్సీ లభ్యమయ్యాయి. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ ఆజాద్,ఏసి రమేష్ బాబు,పిఆర్వో కృష్ణారావు మరియు దేవస్థానం అధికారులు,సిబ్బంది,వ్రత పురోహితులు, అర్చకులు,నాయీ బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

# 7న యలమంచిలి జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

### – అనకాపల్లి నుంచి యలమంచిలి వరకు మెగా ర్యాలీ – మెగా ర్యాలీకు జనసైనికులు తరలి రావాలి



అనకాపల్లి, విజయభాను న్యూస్ : ఈ నెల 7వ తేదీన యల మంచిలి జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు కి స్వాగతం పలికేందుకు అనకాపల్లి జిల్లా జనసైనికులు, వీర మహిళలు అందరూ తరలిరావాలని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, అనకాపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ పరుచూరి భాస్కరరావు అన్నారు. అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం నిర్వహించే ర్యాలీ తో జన సైనికుల సమూహం, బలం ఏంటో అధికార పార్టీకి చూపిద్దాం అన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు అనకాపల్లి పార్టీ కార్యాలయం నుంచి మునగపాక, అచ్యుతాపురం మీదుగా రాంబిల్లిలోని వెంకటాపురం జంక్షన్ వద్ద గల హరిపురం వరకు ర్యాలీ ఉంటుందని అన్నారు. అనకాపల్లి జిల్లాలోని ప్రతీ నియోజక వర్గానికి సొంత కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి ఇంచార్జ్ సుందరపు విజయ్ కుమార్, చోడవరం ఇంచార్జ్ పి వీ యస్ ఎన్ రాజు, మాడుగుల నియోజకవర్గం నాయకులు రాయపురెడ్డి కృష్ణ, పెందుర్తి నాయకులు మొటూరి సన్యాసినాయుడు, కాపు సంఘం విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పైడి కొండ గీతా నాయుడు, జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో యువత భవిత ప్రశ్నార్థకంగా మారింది : మాజీ మంత్రి కోండ్రు



రాజాం (విజయభాను న్యూస్) : మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జి కోండ్రు మురళీమోహన్ విజయనగరం అశోక్ గజపతిరాజు బంగ్లాలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఉద్యోగాలు లేక యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్రంలో యువత భవిత ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తూ వైసీపీ ప్రభుత్వం పై మండిపడ్డారు,సీఎం జగన్ మోహన్ రెడ్డి అమలు కాని హామీలు,మోసకారి మాటలతో ప్రజలను నట్టేట ముంచారన్నారు, ప్రతీ ఏడాది జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ అంటూ ప్రగల్బాలు పలికి నిరుద్యుగులను మోసం చేశారన్నారు, ఉద్యోగుల ఓట్ల కోసం సీపీఎస్ రద్దుచేస్తామని చెప్పి నాలుగేళ్లు గడుస్తున్నా ఆమాటను నిలబెట్టుకోక పోగా ఉద్యోగులను ఇక్కట్లకు గురిచేస్తున్నారన్నారు.

తాము అధికారంలోకి రాగానే రెండున్నర లక్షల ఉద్యోగాల భర్తీ, ప్రతి ఏటా జనవరి 1 న జ్యాబ్ క్యాలెండర్ అంటూ ప్రగల్బాలు పలికిన జగన్ రెడ్డి నిరుద్యోగుల్ని నిలువునా మోసం చేశారన్నారు, ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేక, రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు రాక, స్వయం ఉపాధికి ప్రభుత్వం నుంచి సహకారం అందక యువత భవిత ప్రశ్నార్ధకంగా మారిందన్నారు. ఉపాధి, ఉద్యోగాలు లేక రాష్ట్రంలో గత మూడేళ్లలో 21,575 మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి చెప్పడాన్ని కోండ్రు గుర్తుచేశారు,తెలుగుదేశం పార్టీ హయాంలో పరిశ్రమల ద్వారా 5.13 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు,కానీ నాలుగేళ్ల వైసీపీ పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు, కమీషన్ల కక్కుర్తితో మూడున్న రేళ్లలో 17 లక్షల కోట్ల పెట్టుబడులు పొరుగు రాష్ట్రాలకు తరిమేసి 34 లక్షల మంది యువత ఉపాధికి గండి కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు, అమరావతి నిర్మాణంతో 15 లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుడితే జగన్ రెడ్డి అమరావతిని సైతం నిర్వీర్యం చేశారన్నారు, టీడీపీ హయాంలో 2 సార్లు డీఎస్సీ నిర్వహించి 18 వేల ఉద్యోగాలిచ్చామని, కానీ ప్రతి ఏటా మెగా డీఎస్సీ నిర్వహిస్తామన్న జగన్ రెడ్డి ఒక్క టీచర్ ఉద్యోగం భర్తీ చేయలేదన్నారు,ఐటి అభివృద్ధితో 34 వేల ఉద్యోగాలు, స్కిల్ డెవలప్ మెంట్ ద్వారా 64,000 ఉద్యోగాలిచ్చామని జగన్ రెడ్డి ఐటి కంపెనీలు తరిమేసి, అక్రమ కేసులతో స్కిల్ డెవలప్మెంట్ ని నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు, నిరుద్యోగ యువతకు ప్రభుత్వ పనుల్లో కాంట్రాక్టులు ఇస్తానన్న జగన్ రెడ్డి ఎన్ని కాంట్రాక్టులిచ్చారని ఎంతమందిని కాంట్రాక్టర్లుగా తయారు చేశారని నిలదీశారు,చంద్రబాబు నాయుడు ప్రతినెల 6 లక్షల మంది నిరుద్యోగ యువతకు రెండువేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తే జగన్ రెడ్డి దాన్ని రద్దు చేశారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పోరేషన్ల యువతకు సబ్సిడీ, బ్యాంకు రుణాలతో స్వయం ఉపాధి కల్పిస్తే జగన్ రెడ్డి రద్దు చేసి నిరుద్యోగుల పొట్ట కొట్టారని ఘాటుగా విమర్శించారు,కేంద్రం మెడలు వంచి సాధిస్తానన్న ప్రత్యేక హోదా ఏమైందో చెప్పాలని, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక రాష్ట్రంలో యువత గంజాయి, డ్రగ్స్ మద్యం వ్యవసనాలకు బానిసలుగా మారి జీవితాల్ని పాడుచేసుకుంటున్నారన్నారు, మళ్లీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే యువతీ యువకులకు భవిత అని కోండ్రు అన్నారు, ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు తెలుగుదేశం పార్టీ విజయనగరం జిల్లా ఇంచార్జీలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# గిరిజనుల సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

### పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



అల్లూరిజిల్లా. విజయభాను. న్యూస్. పాడేరు. గిరిజనుల సర్వతో ముఖాభివృద్ధే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు పనిచేస్తున్నారని పాడేరు శాసనసభ్యులు కొట్ట గుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. తన అన్నదమ్ములు అక్కాచెల్లెమ్మలుగా భావించే జగన్మోహన్ రెడ్డి ఆదివాసీయులకు ఎటువంటి కష్టం వచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. జీకే వీధి మండలం గ్రామ సచివాలయం- 1 పరిధిలో రామాలయం వీధి, కొత్తపాకలు గ్రామాల్లో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించే ప్రయత్నం చేశారు. ప్రతిగడపలోనూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మికి ఆయా గ్రామస్థులు సాదర స్వాగతం పలికారు. స్థానికులు సమస్యలను ఎమ్మెల్యే గారికి వివరించారు. కొన్నిచోట్ల సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేయాలని విన్నవించారు. మరొకచోట వంతెన నిర్మాణం అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా భాగ్య లక్ష్మి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా శాసనసభ్యుల స్వయంగా వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకునే పరిస్థితి ఒక్క ఆంధ్ర ప్రదేశ్ లోనే ఉందని అన్నారు ప్రతి సమస్యను శాసనసభ్యుల స్వయంగా వెళ్లి తెలుసుకొనిలి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిజంగానే ఒక విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తుందనిప్రజలసర్వతోముఖాభివృద్ధికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్నటువంటి అభివృద్ధి పథకాలను కూడా ఇతర రాష్ట్రాల అధ్యయనం చేస్తున్నాయని వివరించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా...

108 గడపలను సందర్శించారు.ఈకార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, మండల ప్రెసిడెంట్ బి లక్ష్మణ్, సర్పంచ్ కొర్ర సుభద్ర, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేవుడు, ఎంపిటిసి రాజులమ్మ, డైరెక్టర్ సత్యవతి, ప్రసాద్, వి.అరుణ్ వెంకట్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధిని కాపాడాలని ఎమ్మార్వో ఆఫీస్ వద్ద ధర్నా

**భీమునిపట్నం, విజయభాను న్యూస్** : భీమిలీ మండలం దాక మర్రి పంచాయతీ పరిధిలో ఉన్న ఎర్ర క్వారీ పక్కనే అనుకూలం కానీ ప్రాంతంలో జగనన్న కాలనీ పేరట కొంతమందికి ఇల్లు కేటాయించారని ఇక్కడ కార్మికులు ఆందోళన చెంది స్థానిక భీమిలి ఎమ్మార్వో ఆఫీసు వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాని ఉద్దేశిస్తూ సిఐటియు జోన్ అధ్యక్షులు ఆర్ ఎస్ ఎన్ మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం వెంటనే మార్చుకోవాలని, 100 కుటుంబాల వరకు గత 40 సంవత్సరాల నుండి ఎర్ర క్వారీ లో జీవనం కొనసాగిస్తూ తన కుటుంబాలను పోషించుకుంటున్నారని, వీరి మీద ఆధారపడి మరొక 500 మంది జీవనం కొనసాగిస్తున్నారని, వీరి ఉపాధిని దెబ్బతీసే విధంగా వారి పక్కనే జగనన్న ఇల్లును కేటాయించడం ఏమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం తమ నిర్ణయం మార్చుకొని వేరే చోట లబ్ధిదారులకు ఇల్లు కేటాయించాలని ఇది అనుకూలమైన ప్రాంతం కాదని ఆయన అన్నారు.



# సన్‌స్క్రీన్ లోషన్ ఎందుకు?



సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడుగునా స్కిన్‌ని సూర్యుని నుంచి వచ్చే కిరణాల నుంచి కాపాడుకునేందుకు సన్ స్క్రీన్ లోషన్లు రాస్తూ ఉంటాం. అసలు సన్ స్క్రీన్ లోషన్లు ఎందుకు వాడలి? వీటి వాడకం వల్ల ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు చూద్దాం. సూర్య కిరణాల నుంచి మన శరీరానికి విటమిన్ D అందుతుంది. అలాగే ఆ కిరణాలు మనకి హాని కలిగించకుండా కూడా చూసుకోవాలి. సన్ స్క్రీన్ అప్లై చేయడం వల్ల ఈ కిరణాలు చర్మం లోపలికి చొచ్చుకుని వెళ్ళి హాని కలిగించకుండా కాపాడుతుంది. వయస్సు ఎక్కువైనా యవ్వనంగా కనిపించాలి అని అందరూ అనుకుంటారు. దీని కోసం ఎప్పుడూ మెరుపు, ఆరోగ్యంగా ఉండే స్కిన్ కావాలి అనుకుంటారు. చర్మాన్ని బట్టి మనకు సూటయ్యే సన్ స్క్రీన్ రాసుకోవడం వల్ల స్కిన్ యూత్‌ఫుల్ గా కనిపిస్తుంది. ముడతలు రావు. సన్ స్క్రీన్ ట్యానింగ్ కలుగకుండా కూడా ప్రొటెక్ట్ చేస్తుంది. సన్ స్క్రీన్‌ని ప్రతి రెండు గంటలకి ఒకసారి అప్లై చేయాలి. మీరు స్ప్రే సన్ స్క్రీన్ యూజ్ చేసినా, చెమట బాగా పట్టినా, ఈత కొట్టినా గంట, గంటన్నరకే మళ్ళీ అప్లై చేసుకోవాలి. సన్ స్క్రీన్ క్రీమ్ అయినా సన్ స్క్రీన్ లోషన్ అయినా తప్పకుండా కెమికల్స్ అనేది ఉపయోగిస్తారు. వీటి వల్ల చర్మానికి కొన్ని రియాక్షన్స్ వస్తాయని నిపుణులు అంటున్నారు. ఎక్స్పైర్ అయిపోయిన తర్వాత ఉపయోగించడం వల్ల ముఖంపై ఇరిటేషన్ లేదా చర్మం ఎరుపెక్కడం లాంటి సమస్యలు వస్తాయి. అలర్జీలు, సున్నితమైన చర్మం ఉన్నవారు ఆల్కహాల్ కలిగిన లోషన్లు వాడకపోవడం ఉత్తమం. అలాగే చిన్నారులకు డై ఆక్సీబెంజాన్ ఉండే సన్‌స్క్రీన్ లోషన్లు వాడకూడదు. సున్నిత చర్మం కలిగిన వాళ్లు చర్మ వైద్యుల సూచన మేరకు 50 ప్లస్ సన్‌స్క్రీన్ లోషన్స్ వాడాలి. జిడ్డు చర్మం ఉన్నవాళ్లు మాయిశ్చరైజర్ లేని లోషన్లు ఎంచుకోవాలి. పొడి చర్మం ఉన్నవారు మాత్రం మాయిశ్చరైజర్ కలిగిన సన్‌స్క్రీన్ లోషన్లు వాడొచ్చు.

# ఇంట్లో బొద్దింకల బెడద ఎక్కువగా ఉందా..?

## ఇలా చేస్తే అసలు కనిపించవు

సాధారణంగా ఏదో ఒక సమయంలో ప్రతి ఇంటిలోనూ బొద్దింకలు కనబడుతూ ఉంటాయి ఎక్కువగా వంటగది కబోర్డ్స్ లో ఉంటాయి ఇవి బ్యాక్టీరియాకు వాహకాలుగా ఉంటాయి మనం పడేసే ఆహారాన్ని తింటూ బతుకుతాయి ఇవి చాలా తక్కువ సమయంలోనే సంతానాన్ని వృద్ధి చేసుకుంటాయి మనకు చాలా అసౌకర్యానికి గురి చేస్తాయి.ఇంటి చిట్కాల ద్వారా బొద్దింకలను తరిమికొట్టొచ్చు

బేకింగ్ సోడా లో పంచదార కలిపి బొద్దింకలు ఉండే ప్రదేశంలో చల్లాలి. బొద్దింకలకు చక్కెర అంటే చాలా ఇష్టం కానీ దానిలో కలిపిన బేకింగ్ సోడా ను బొద్దింకలు జీర్ణం చేసుకోలేక చనిపోతాయి



బొద్దింకలు కాఫీ వాసనకు చాలా సులభంగా ఆకర్షితం అవుతాయి. అయితే కాఫీ రుచి చూసిన తర్వాత కాఫీలో ఉండే కెఫిన్ చంపుతుంది అందువల్ల. బొద్దింకలు ఉన్న ప్రదేశంలో కాఫీ పొడి జల్లితే బొద్దింకలు పోతాయి

పుదీనా కూడా బొద్దింకలను తరిమి కొట్ట దానికి చాలా ఎఫెక్టివ్ గా పని చేస్తుంది పుదీనా ఆకులను బొద్దింకలు ఉన్న ప్రదేశంలో పెట్టవచ్చు.

బొద్దింకలు ఉల్లి వెల్లుల్లి వాసనను అస్సలు భరించలేవు. అందువల్ల ఉల్లి పాయ, వెల్లుల్లి కొన్ని మిరియాలు నీటిలో వేసి బాగా మరిగించి ఆ నీటిని బొద్దింకలు ఉన్న ప్రదేశంలో spry చేస్తే పారిపోతాయి.

# 'అల్లం వెల్లుల్లి టీ'తో రోగాలు దూరం



ప్రపంచంలో ప్రజల జీవితాలను.. కరోనాకి ముందు.. తర్వాత అని చెప్పుకోలేమో.. అవును కరోనా వైరస్ వెలుగులోకి వచ్చి.. ప్రపంచ దేశాల్లో సృష్టించిన కల్లోలంతో మనిషి జీవితంలో అనేక మార్పులు వచ్చాయి. వాటిల్లో ముఖ్యంగా ఆహారం నియమాలను మార్పు చేసుకున్నాడు. కరోనాకి ముందు.. రోగనిరోధక శక్తికి కానీ.. అందుకు అవసరమైన ఫుడ్ కానీ తినడానికి పెద్దగా ప్రిఫరెన్స్ ఇవ్వని వారు సైతం.. ఇప్పుడు తప్పనిసరిగా ఇమ్యూనిటీని పెంచే ఆహారం తీసుకోవడానికి ఇష్టపడుతున్నాడు. డ్రైఫ్రూట్స్, అల్లం , వెల్లుల్లి, పసుపు వంటి అనేకవాటిని రోజువారీ ఆహారంగా చేసుకున్నాడు. ఎందుకంటే కోవిడ్ మహమ్మారి.. రోగనిరోధక శక్తి ఉన్నవారి దరిచేరదని ఆరోగ్య నిపుణుల హెచ్చరికతో తినే ఆహారానికి కూడా అత్యంత ప్రధాన్యతను ఇస్తున్నాడు. రోజుకో రకమైన వేరియంట్ గా మారుతూ.. మనిషి జీవితాన్ని ప్రభవిసతం చేస్తున్న కరోనాకు చెక్ పెట్టడానికి.. ప్రతి ఒక్కరూ రోగనిరోధక శక్తిని పెంచుకోవాల్సిందే.. అందుకు ప్రతి ఒక్కరూ తినే ఆహారంలో అనేక ఆరోగ్యకరమైన, వైద్యపరమైన పదార్థాలను జోడించాలి. ఈరోజు రోగనిరోధక వ్యవస్థ కోసం పెంచే సామర్థ్యం గల "టీ" తయారీ.. ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.. అల్లం, వెల్లుల్లి టీ తయారీ:ఒక గిన్నె లో నీరు వేసి మరిగించాలి. వెల్లుల్లి, తురిమిన అల్లం జోడించండి. తక్కువ వేడి మీద బాగా మరిగించండి. ఇలా మరిగిన నీటిలో కొంచెం నిమ్మరసం, తేనె జోడించండి. మీరు తాగగలిగిన వేడితో ఈ అల్లం, వెల్లుల్లిని టి ని తాగండి. ఆరోగ్య ప్రయోజనాలు:అల్లం, వెల్లుల్లి టీ ఆరోగ్యానికి చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. రోజూ ఒక కప్పు అల్లం-వెల్లుల్లి టీ తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అందుకనే టీ అలవాటు ఉన్నవారు ఉదయం సమయంలో అల్లం-వెల్లుల్లి టీ తాగడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నారు. ఈ టీని ఉదయం అల్పాహారానికి ముందు తాగవచ్చు. అల్లం . వెల్లుల్లి శ్వాస సంబంధిత సమస్యలను నివారిస్తుంది.మహిళలు రుతుస్రావం నొప్పితో బాధపడుతుంటే మంచి ఉపశమనం కలిగిస్తుంది. యాంటీఆక్సిడెంట్‌లతో రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.మలబద్ధకాన్ని నివారిస్తుంది. బరువుని తగ్గిస్తుంది. అల్లం-వెల్లుల్లి టీ తాగడం వల్ల మీ జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. గొంతు నొప్పి నుండి ఉపశమనం లభిస్తుంది.అల్లంలో అస్థిర నూనెలు ఉన్నాయి. అవి శరీరం యొక్క రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి ఉత్తమంగా పనిచేస్తాయి. ఇక వెల్లుల్లిలో సల్ఫర్ అధికంగా ఉంటుంది. ఇది ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది.

# వేసవి తాపాన్ని తీర్చే కుకుంబర్ చాస్

**ఎండలు మండుతున్నాయి. ఈ కాలంలో వేసవి తాపాన్ని తీర్చాలంటే.. జ్యూస్‌లు, కొబ్బరినీళ్లు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి. వైద్యులు కూడా ఈ కాలంలో మజ్జిగ ఎక్కువగా తీసుకోమని సలహా ఇస్తారు. మజ్జిగతో చేసే లస్సీ వంటివి రోజూ తాగినా.. కీరదోసకాయతో తయారుచేసే చాస్‌ని కూడా తాగితే.. డీహైడ్రేషన్‌కి లోనుకాకుండా ఉంటారు. మరి కుకుంబర్ చాస్‌ని ఎలా తయారుచేసుకోవాలో తెలుసుకుందామా..! పదార్థాలు** : కీరదోసకాయ – ఒకటి, పచ్చిమిర్చి – రెండు, మజ్జిగ – 500 ఎం.ఎల్, జీలకర్ర పొడి – అర టేబుల్ స్పూను, బ్లాక్ సాల్ట్ – అరటేబుల్‌స్పూను, ఉప్పు – అరటేబుల్‌స్పూను, పుదీనా – రెండు లేదా మూడు, ఐస్ – కొద్దిగా.తయారుచేసే విధానం : కీరదోసకాయని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఈ ముక్కల్ని మిక్సీజార్‌లో వేసుకుని, పచ్చిమిర్చిని కూడా వేసుకుని మిక్స్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఓ గిన్నెలోకి తీసుకొని అందులో మజ్జిగ వేసుకుని కలుపుకోవాలి. ఈ మిశ్రమంలో జీలకర్రపొడి, బ్లాక్ సాల్ట్, ఉప్పు, పుదీనా ఆకులు, కొద్దిగా ఐస్ వేసుకుని కలుపుకోవాలి. దీన్ని గ్లాస్‌ల్లో సర్వ్ చేసుకుని తాగితే.. చాలా టేస్టీగా ఉంటుంది.

ఇందులో కీర దోసకాయ, మజ్జిగ ఉండడం వల్ల కూల్‌గా ఉంటుంది.



# చక్కెర, బెల్లంలో బెస్ట్ ఏదంటే.?



చక్కెర, బెల్లం రెండూ కూడా చెరకు రసం నుంచే తయారు చేస్తారు. అయితే, పంచదార కంటే బెల్లంతోనే ప్రయోజనమని నిపుణులు పేర్కొంటున్నారు. చక్కెరలో కేలరీలు మాత్రమే ఉంటే బెల్లంలో చాలా పోషకాలు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఉన్నాయని చెబుతున్నారు. బెల్లం తింటే రోగ నిరోధక శక్తిని పెంచడం సహా ఉబ్బసం, దగ్గు, కామెర్లు, ఛాతీ నొప్పి వంటి వివిధ వ్యాధులు నయమవుతాయని పేర్కొంటున్నారు. జీర్ణశక్తి కూడా బలపడుతుందని అంటున్నారు.

# వేసవి కాలంలో మీ మాయిశ్చరైజర్ మార్చండి



వేసవి కాలంతో పోలిస్తే.. శీతాకాలం మీ చర్మం పొడిగా ఉంటుంది. ఆ సీజన్‌లో వాడే మాయిశ్చరైజర్ కాస్త ఆయిలీగా, హెవీగా ఉంటుంది. అటువంటి మాయిశ్చరైజర్ ఈ కాలానికి సరిపోదు. మీ డెర్మటాలజిస్ట్‌ను కలిసి ఈ సీజన్‌కు సరిపడా క్రీమ్ వాడాలి.

వేసవి స్కిన్ కేర్ రొటీన్‌లో ఏది మర్చిపోయినా.. మీ చర్మానికి సన్‌స్క్రీన్ రాయడం మాత్రం మర్చి పోవద్దు. బయటికి వెళ్లేటప్పుడు మాత్రమే కాదు, ఇంట్లో ఉన్నప్పుడూ సన్‌స్క్రీన్ రాసుకోవడం మంచిది. ఇది చర్మాన్ని యూవీ కిరణాల నుంచి రక్షించడమే కాదు, స్కిన్‌ను తేమగా ఉంచడంలో సహాయపడుతుంది.

# స్పైసీ ఎగ్ కర్రీ



**కావలసిన పదార్థాలు**

గుడ్లు: నాలుగు, టమాట గుజ్జు: ఒక కప్పు, ఉల్లిగడ్డ: ఒకటి, పచ్చిమిర్చి: రెండు, కరివేపాకు: రెండు రెబ్బలు, అల్లం వెల్లుల్లి పేస్ట్: ఒక టీస్పూన్, ధనియాల పొడి: ఒక టీస్పూన్, గరం మసాలా: అర టీస్పూన్, పసుపు: పావు టీస్పూన్, కారం: రెండు టీస్పూన్లు, ఉప్పు: తగినంత, నూనె: పావు కప్పు, దాల్చిన చెక్క: చిన్న ముక్క, జీలకర్ర: అర టీస్పూన్, కొత్తిమీర తురుము: కొద్దిగా.

**తయారీ విధానం :**

గుడ్లను ఉడకబెట్టి పెంకు ఒలిచి గాట్లు పెట్టుకోవాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి నూనె వేడయ్యాక జీలకర్ర, దాల్చిన చెక్క వేసి బాగా వేగాక సన్నగా తరిగిన ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, కరివేపాకు వేసి వేయించాలి. అన్నీ బాగా వేగాక టమాట గుజ్జు, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్ట్, ధనియాలపొడి, కారం, ఉప్పు వేసి సన్నని మంటపై నూనె పైకి తేలేంత వరకు కలుపుతూ ఉడికించాలి. చివరగా ఉడికించిన గుడ్లు, గరం మసాలా, కొత్తిమీర తురుము వేసి మరో నిమిషం పాటు ఉడికించి దించుకుంటే స్పైసీ ఎగ్ కర్రీ సిద్ధం.

# కలబందతో మీ చర్మాన్ని ఇలా మెరిపించుకోవచ్చు



కలబంద చర్మానికి అనేక ప్రయోజనాలు అందిస్తుంది. దీనికి చర్మాన్ని కాంతివంతంగా మార్చే సామర్థ్యం ఉంటుంది. మెలనిన్ ఉత్పత్తికి కారణం అయ్యే ఎంజైమ్ చర్యను నిరోధిస్తుంది. మీ మెడ నల్లగా ఉంటే.. కలబంద గుజ్జును మెడకు అప్లై చేసి.. సున్నితంగా మసాజ్ చేయండి. ఆ తర్వాత 10 – 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత చల్లటి నీళ్లతో మెడను శుభ్రం చేసుకోండి. ఇలా తరచుగా చేస్తుంటే.. మెడ నలుపు దూరం అవుతుంది.


# విటమిన్స్ అందించే ఐస్ ఆపిల్..

## మండుటెండల్లో తాటి ముంజలతో ఉపశమనం



భానుడు భగభగమంటున్నాడు. తన ప్రతాపాన్ని చూపుతూ చెమటలు కక్కిస్తున్నాడు. ఈ క్రమంలో ఎండ వేడిమి నుంచి ప్రజలు ఉపశమనం పొందేందుకు పలుదారు లు వెతుక్కుంటున్నారు. ఉక్కపోతను తట్టుకునేందుకు, శరీరం డీహైడ్రేషన్ కాకుండా ఉం డేందుకు తాటి ముంజలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. దాదాపు మూడు నెలలపా టు లభించే ఈ ఫలాలతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. అన్ని వయస్సుల వారు తినొచ్చు. విటమిన్-బి, బి 12, ఐరన్, కాల్షియం వం టివి ఇందులో పుష్కలంగా ఉన్నాయి. బరువు తగ్గేందుకు ఇవి ఎంతో ఉపయోగపడుతాయి.వీటిలో అధిక శాతం నీరు ఉండడంవల్ల ఈ ఫ లాలను తింటే పొట్టలో నిండుగా నీరు ఉన్న అనుభూతి కలుగుతుంది. జూస్‌లా చేసి తీసుకుంటే మలబద్ధకాన్ని నివారించొచ్చు. అలస ట, వికారం వంటి సమస్యలు తగ్గుతాయి. గర్భిణులు, లివర్ సమస్యలు ఉన్న వారు వీ టిని తరుచుగా తీసుకోవాలి. తాటిముంజలను గుజ్జులా చేసి.. అందులో కొద్దిగా పాలపొడి కలిపి.. మొహానికి పూసుకున్న కొద్దిసేపటి తరువాత కడిగితే చర్మవ్యాధులు తగ్గుతాయి. చ ర్మం కాంతివంతంగా మారుతుంది. కల్తీ లేని తాటి ముంజలను తినడం వల్ల శరీరంలో చక్కె ర, ఖనిజాల ప్రమాణాలను సమతుల్యం చేస్తా యి. వేసవిలో మాత్రమే దొరికే తాటి ముంజలకు మస్తు గిరాకీ ఉంటున్నది. గ్రామాల్లో విరివిగా లభించే ఈ పండ్లు ఇప్పుడు పట్టణాల్లో కూడా దొరుకుతున్నాయి.

# ఆలూ, మటన్ కీమా




**మటన్ కీమా** : అర కిలో, ఆలు గడ్డలు: రెండు(పెద్దవి), నూనె: రెండు టేబుల్ స్పూన్లు, ఎండు మిర్చి: ఎనిమిది, పచ్చిమిర్చి: నాలుగు, ఉల్లిగడ్డ: ఒకటి, టమాట: రెండు, గడ్డపెరుగు: పావుకప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్: ఒక టేబుల్ స్పూన్, మిరియాల పొడి: అర టీస్పూన్, పసుపు: పావు టీస్పూన్, ధనియాల పొడి: ఒకటిన్నర టీస్పూన్, గరం మసాల: ఒక టీస్పూన్, వేయించిన జీలకర్ర పొడి: అర టీస్పూన్, యాలకులు: రెండు, దాల్చిన చెక్క: చిన్న ముక్క, ఉప్పు: తగినంత, కొత్తిమీర తురుము: కొద్దిగా.

**తయారీ విధానం** : కడాయిలో నూనె వేడయ్యాక ఎండు మిర్చి వేయించాలి. వేగిన మిర్చిని పక్కన పెట్టి, అదే నూనెలో దాల్చిన చెక్క, యాలకులు, సన్నగా తరిగిన ఉల్లిగడ్డ వేయించుకోవాలి. దోరగా వేగాక అల్లం వెల్లుల్లి పేస్ట్, మటన్ కీమా, ధనియాల పొడి, మిరియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా, పసుపు వేసి పది నిమిషాల పాటు సన్నని మంటపై ఉడికించాలి. టమాట ముక్కలు, పెరుగు, చిన్నగా తుంచిన వేయించిన ఎండు మిర్చి వేసి తగినన్ని నీళ్లు పోసి మూతపెట్టి నలభై నిమిషాలపాటు సన్నని మంటపై ఉడికించాలి. నూనె పైకి తేలాక తొక్కతీసిన ఆలుగడ్డ ముక్కలు, తగినంత ఉప్పు, పచ్చిమిర్చి ముక్కలు వేసి మరిన్ని నీళ్లుపోసి మరో పావుగంటపాటు ఉడికించాలి.చివరగా కొత్తిమీర తురుము వేసి దించుకుంటే నోరూరించే ఆలూ కీమా సిద్ధం.

# 'హైపర్' సమస్య

'హైపర్' సమస్య దేశంలో థైరాయిడ్ సమస్యతో బాధపడేవారు చాలామందే కనిపిస్తారు. సీతాకోక చిలుక ఆకారంలో గొంతు భాగంలో ఉండే గ్రంథి పేరే.. థైరాయిడ్. ఇది తగిన మొత్తంలో థైరాయిడ్ హార్మోన్‌ను స్రవించకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతాయి. థైరాయిడ్ గ్రంథి మరీ చురుగ్గా ఉంటే.. ఎక్కువ హార్మోన్‌ను స్రవిస్తుంది. దేశంలో థైరాయిడ్ సమస్యతో బాధపడేవారు చాలామందే కనిపిస్తారు. సీతాకోక చిలుకఆకారంలో గొంతు భాగంలో ఉండే గ్రంథి పేరే.. థైరాయిడ్. ఇది తగిన మొత్తంలో థైరాయిడ్ హార్మోన్‌ను స్రవించకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతాయి. థైరాయిడ్ గ్రంథి మరీ చురుగ్గా ఉంటే.. ఎక్కువ హార్మోన్‌ను స్రవిస్తుంది. హైపర్ థైరాయిడిజం అంటే ఇదే. ఈ పరిస్థితి జీవక్రియలను వేగవంతం చేస్తుంది. అలా శరీర విధుల మీద కూడా ప్రభావం చూపుతుంది.





**ప్రాన్ బైట్స్ :** రొయ్యలు: 250 గ్రాములు, మిరియాల పొడి: 2 టేబుల్ స్పూన్లు, గుడ్లు : రెండు (తెల్లసొన), సోయాసాస్: ఒక టీస్పూన్, నూనె: వేపుడుకు తగినంత, వెల్లుల్లి: 8 రెబ్బలు, సన్నగా తరిగిన ఉల్లిగడ్డ: కప్పు, మక్కజొన్న పిండి: 2 టీస్పూన్లు, బ్రెడ్ క్రంబ్స్: 3 కప్పులు, ఉప్పూకారం: తగినంత. బ్రెడ్ క్రంబ్స్ మినహా మిగతా పదార్థాలన్నీ ఫుడ్ ప్రాసెసర్‌లో వేసి ముద్దగా చేసుకోవాలి. ఇందాక మిక్సీ వేసిన మిశ్రమాన్ని చిన్నచిన్న ముద్దలుగా చేసుకుని బ్రెడ్ క్రంబ్స్‌లో దొర్లించి నూనెలో వేయించాలి. బంగారు రంగు వచ్చాక తీసేసి, సాస్‌తో సర్వ్ చేయాలి.

# బీసీల అభ్యున్నతి కోసం దివాకర్ పరి తపించేవారు

- పార్టీ అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేశారు
- నగర వైకాపా ఆధ్వర్యంలో సంతాప సభ
- ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి గుడివాడ అమర్నాథ్



మద్దిలపాలెం (విజయభాను న్యూస్): వైసీపీ జిల్లా పార్టీ కర్యాలయంలో వైసీపీ నాయకులు పక్కి దివాకర్ సంతాప సభ గురువారం జరిగింది.జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన సంతాప సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పరిశ్రమలు, ఐ టి శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ దివాకర్ మరణించారనే వార్త నమ్మలేకపోయానని అన్నారు.పక్కి దివాకర్ ప్రతి రోజు నన్ను కలిసేవారని,కారోన సెకండ్ వేవ్ లో అనారోగ్యానికి గురయ్యారని,వైసీపీ పార్టీ స్థాపించిన నాటి నుంచి పార్టీ అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేసారని తెలిపారు. మా ఇద్దరి మధ్య ఎనలేని అనుబంధం ఉందని .నిరంతరం పార్టీ బలోపేతం కోసం ఆలోచించే వ్యక్తని,కుమార్తె ను ఐ ఏ ఎస్ చేయాలి అనేది ఆయన కోరిక ఉందని చెప్పే వరన్నారు.దివాకర్ కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు.బిసిల ఐక్యత కోసం ఆయన నిరంతరం తపించే వారని,ఆయన ఆశయాలు కోసం పనిచేస్తామని తెలియజేసారు.పార్టీ తరుపున దివాకర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ పార్టీ ఒక నిబద్ధత కలిగిన నాయకున్ని కోల్పోయిందన్నారు.పార్టీ తరుపున కుటుంబానికి అండగా ఉంటామన్నారు.ఎమ్మెల్సీ వంశీ కృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ దివాకర్ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాన న్నారు .పార్టీ అభివృద్ధి కోసం తపన పడే వ్యక్తి మన మధ్య లేకపోవడం బాధాకరమని,నాకు దివాకర్ కు 14 సంవత్సరాలు అనుబంధం ఉందని తెలిపారు.పార్టీ స్థాపించిన సమయం లో పార్టీ అభివృద్ధి కోసం చాలా కష్టపడ్డారని, దివాకర్ ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాని అన్నారు.దివాకర్ సోదరుడు రవి మాట్లాడుతూ ప్రతి రోజు తల్లి దీవెనలు తీసుకొని బయటకు వెళ్లేవారని,తల్లికి ప్రాధాన్యత ఇచ్చేవారని ఆయన తెలిపారు.దివాకర్ వైసీపీ పార్టీ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేసారని,జగన్ గెలుస్తారు అని చెప్పారు అదే జరిగిందన్నారు. ప్రక్క రాష్ట్రంలో నా సోదరుడు చనిపోతే పార్ధీమదేహాన్ని విశాఖ కు తీసుకురావడానికి పార్టీ చాలా సహాయం చేసిందని,అందరికి పేరు పేరు నా ధన్యవాదాలు తెలిపారు.శాసన సభ్యులు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, శాసనమండలి సభ్యురాలు వరుదు కళ్యాణి, మాజీ శాసనసభ్యులు విజయ్ కుమార్, కార్మిక నాయకుడు మంత్రి రాజశేఖర్ తదితరులు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ ల చైర్మన్ అనూష పట్నాయక్ పిల్లి సుజాత పిల్లా సుజాత తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

## 49వ వార్డు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కె.కె రాజు



మురళీనగర్ (విజయభాను న్యూస్) : గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా విశాఖ ఉత్తర నియోజకవర్గం 49వ వార్డు బర్మా క్యాంప్ సచివాలయం 1086282 పి.ఆర్ గార్డెన్, మాణిక్యాంబ కాలనీ, చాకలి గెడ్డ ప్రాంతంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త,రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు, 49వ వార్డు డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లుశంకర్ రావు తో కలిసి పర్య టించారు. ఈ కార్యక్రమంలో బాగంగా ఇంటింటికి వెళ్ళి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలను వివరిస్తూ – ప్రజల సమస్యలు తెలుసు కుంటూ పర్యటించారు.ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు, చివరి లబ్ధిదారుని వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రం మొత్తం 175 నియోజకవర్గాల్లో గడపగడపకు మన ప్రభుత్వము కార్య క్రమం చేపట్టారని అన్నారు.

గడపగ డపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను నేరుగా ప్రజా ప్రతినిధులు తెలుసు కునేందుకు ఎంతగానో దోహదపడుతుందని తద్వారా ఆయా సమస్యలను పరిష్కార దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్. ఐ.రవికుమార్, రాయుడు శ్రీను, నూకరాజు,49 వ వార్డ్ నాయకులు, ఢిల్లీ రావు, రాము, సరస్వతమ్మ పావని, రాంబాబు, ఏషు, ఆచారి, మున్నా, సుబ్బ లక్ష్మి,మస్తాన్, దేవుడు, హైమ, సీనియర్ నాయకులు షేక్ బాబ్జి, కె.చిన్న, వసంతల అప్పారావు, సబ్బవరపు శీను, గురువోజీ,కరి రామారెడ్డి, జక్కంపూడి సత్యనారాయణ, మరియు అధికారులు సచివాల యం సిబ్బంది, వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.



# టీడీపీ అక్రమాలపై సిట్ దర్యాప్తు జరగాల్సిందే

- తిత్లీ పరిహారం, వంశధార ప్యాకేజీ అవకతవకలపై దర్యాప్తు కోరుతాం
- మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట(విజయభాను న్యూస్) : చంద్రబాబు ముఖ్య మంత్రిగా ఉన్నంత కాలం రాష్ట్రంలో అవినీతి, అక్రమాలకూ అడ్డూ ఆపూ లేకుండా పోయిందని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సిట్ ఏర్పాటుపై సుప్రీం తీర్పుని వెంటనే ఆచరణలో పెట్టి దర్యాప్తు ఆరంభించాలని కోరారు. అమరావతి రాజధాని పేరుతో పెద్ద ఎత్తున జరిగిన భూ కుంభకోణమే కాకుండా టీడీపీ హయాంలో శ్రీకాకుళం జిల్లాలో వందల కోట్ల రూపాయల కుంభకోణాలున్నాయని అన్నారు. బినామీ పేర్లతో తిత్లీ తుపాను పరిహారం పరిహారం పక్కదారి పట్టించడం, వంశధార యూత్ ప్యాకేజీ అవకతవకలపై దర్యాప్తు చేయాలని సిట్ ని కోరుతున్నామన్నారు. అన్ని ఆధారాలను దర్యాప్తు బృందానికి అంద జేస్తామని తెలిపారు.

ఇప్పటికి చంద్రబాబు పాపాలు పండే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు నష్టం కలిగించినప్పుడు కచ్చితంగా సమీక్ష జరగాల్సిందేనన్నారు అమరావతి భూదందా నిజం అని చెప్పడానికి ఇప్పుడు మార్గం సుగమం అవుతుందని తెలిపారు. ఫైబర్ నెట్, స్కిల్ డెవలప్మెంట్ స్కామ్ లో చంద్రబాబు పాత్ర ఇప్పటికే స్పష్టమైందని చెప్పారు. దర్యాప్తు చేస్తే వేధింపులు, చెయ్యకపోతే ధైర్యం లేదంటూ చంద్రబాబు మాట్లాడుతున్నారని, దర్యాప్తులో అన్నీ తెలుస్తాయని పేర్కొన్నారు. తప్పులు చేసి స్టే లు తెచ్చుకుంటూ వాళ్ళు రోజులు నెట్టుకొచ్చారని, ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు వారికి ఒక చెంప పెట్టని కృష్ణ దాస్ చెప్పారు.

# పిచ్చుకల సంతతి,సంరక్షణ మనందరి బాధ్యత

## – నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి



విశాఖపట్నం(విజయభాను న్యూస్): అంతరించిపోతున్న పిచ్చుకల సంతతిని పెంచుటకు కృషి చేస్తూ, మన ఇంటి పరిసరాలకు వచ్చే పిచ్చుకలకు ఆహారపు గింజలను వేసి, వాటి సంరక్షణ మన బాధ్యతగా భావించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. గురువారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలో గ్రీన్ క్లైమేట్ టీమ్ స్వచ్ఛంద సంస్థ జివిఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "పిచ్చుకల సంతతి పెరగడానికి కృషి చేద్దాం" అనే కార్యక్రమానికి ముఖ్య అతిదిగా విచ్చేసి మట్టి పిచ్చుక గూడులను, మట్టి పాత్రలను పంపిణి కార్యక్రమం ప్రారంభించి పలువురికి అందచేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, క్రమేపి పిచ్చుకల సంతతి అంతరించి పోతున్నందున వాటి సంతతిని పెంచి, సంరక్షిచుకోవలసిన భద్యత మనందరిపై వుందని అన్నారు. మనుష్యులే రోడ్ పైన నడవలేకపోతున్న ఈ వేసవి కాలంలో వాటికి దాహార్తిని తీర్చి కాపాడుకోవాలని అన్నారు. ఈ వేసవి కాలంలో పక్షులు, ఇతర జీవుల కోసం చిరు ధాన్యాలను, మంచి నీటి వసతి కల్పించడం మన తక్షణ కర్తవ్యం అన్నారు. ప్రధానంగా పిచ్చుకలు వరి పంటను ఆశించే నల్లి పురుగులను, మన ఇళ్ళలో హాని కలిగించే క్రిమి కీటకాలను ఆహారంగా తీసుకుంటాయన్నారు. వేలాది సంవత్సరాలుగా మన పూర్వీకులు ఇంటి ముందు వరి కంకుల గుత్తులను ఇళ్ళకు వేలాడదీసేవారని, ఆ పద్దతిని మనం అవలంబించేందుకు నగరంలో వున్న "గ్రీన్ క్లైమేట్ టీమ్ స్వచ్ఛంద సంస్థ" జివిఎంసి ఆధ్వర్యంలో ప్రజల అవగాహన కొరకు 400 మట్టి పిచ్చుక గూడులను, మట్టి పాత్రలను పంపిణి కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ, ఆ టీమ్ ప్రతినిధి జె.వి.రత్నంను, వారి బృందాన్ని అభినందించారు. నిరంతరం "గ్రీన్ క్లైమేట్ టీమ్ స్వచ్ఛంద సంస్థ" సమాజ శ్రేయస్సుకు, పర్యవరణ పరిరక్షణకు, మూగ జీవుల సంరక్షణ స్వచ్ఛంద సేవలకు ఎప్పుడు ముందడుగు వేయడం చాల సంతోషదాయకం అన్నారు. అనంతరం, మట్టి పిచ్చుక గూడులను జివిఎంసి సిబ్బందికి, పౌరులకు పంపిణీ చేస్తూ, నగరంలో గల నివాసితులు ఇంటి పరిసరాలలో మూగ జీవులకు, పక్షులకు, పిచ్చుకలకు మంచి నీటిని, ఆహారాన్ని అందుబాటులో వుంచి వాటి సంతతిని పెంచి, సంరక్షించుకోవలసిన బాధ్యతను చేపట్టాలని మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కార్యనిర్వహ ణాధికారి స్వరాజ్య లక్ష్మి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.పద్మజ,యూ.ఎన్.డి.పి కోఆర్డినేటర్ ఎన్.ఎస్.రాజమణి, రవి కుమార్, జివిఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మా పతకాలను వెనక్కి ఇచ్చేస్తాం : హెచ్చరించిన రెజ్లర్లు



దిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ కు వ్యతిరేకంగా నిరసనలు చేపడుతోన్న రెజ్లర్ల పై దిల్లీ పోలీసులు అనుచితంగా ప్రవర్తించడంపై క్రీడాకారులు తీవ్రంగా మండిపడ్డారు. ఇలాగైతే తమకు వచ్చిన పద్మశ్రీలతోపాటు ఇతర పతకాలను, అవార్డులను వెనక్కి ఇచ్చేస్తామని హెచ్చరించారు. ఇలాంటి అవమానాలు భరించాల్సి వస్తే తమకు వచ్చిన ఈ గౌరవాలతో ప్రయోజనం లేదని విలపిస్తూ తమ ఆవేదన వ్యక్తం చేశారు.

'మా పతకాలను వెనక్కి తీసుకోండి. మమ్మల్ని చాలా అవమానాలకు గురిచేస్తున్నారు. మా గౌరవం కోసం పోరాడుతున్నాం. కానీ, వాళ్ల కాళ్లకింద నలిగిపోతున్నాం. మా పతకాలను వెనక్కి ఇవ్వడంతోపాటు మా జీవితాలను కూడా ఇచ్చేస్తాం. కానీ, మాకు మాత్రం న్యాయం చేయండి' అని వినేశ్ ఫొగాట్ ఆవేదన వ్యక్తం చేశారు. తనపై పురుష పోలీసులు అనుచితంగా ప్రవర్తించి వేధించారని.. ఆ సమయంలో ఏ ఒక్క మహిళా పోలీసు కూడా లేరని వాపోయారు.

**చేయిచేసుకోవడం సిగ్గుచేటు..**

మహిళా రెజ్లర్లపై పోలీసులు చేయిచేసుకోవడం సిగ్గుచేటు అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశ వనితలపై దాడులకు పాల్పడటానికి భాజపా ఎన్నడూ వెనుకాడదని ఆరోపించారు. భాజపా ఇచ్చే 'బేటీ బచావో' నినాదం కేవలం మాటలకే పరిమితం అని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు.

**అది అహంకారమే..**

తమకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న రెజ్లర్లతో పోలీసులు ఘర్షణకు దిగడం జాతీయ క్రీడాకారులకు అవమానకరమని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. అహంకారంతోనే భాజపా ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. దౌర్జన్యంతో వ్యవస్థను నడపాలని భాజపా అనుకుంటోందని ఆరోపించిన కేజ్రీవాల్.. అధికారం నుంచి ఆ పార్టీని దూరం చేయాలని పిలుపునిచ్చారు.

**మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ మద్దతు**

ఆందోళన చేస్తున్న స్టార్ రెజ్లర్లకు దిల్లీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ స్వాతి మద్దతు ప్రకటించారు. గురువారం ఉదయం దీక్షా స్థలికి చేరుకున్న ఆమె.. మహిళా క్రీడాకారిణులపై పోలీసు సిబ్బంది అసభ్యకరంగా ప్రవర్తించడం దారుణమన్నారు. దీనిపై ఫిర్యాదు అందిన అనంతరం వారిపై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్, సాక్షి మాలిక్, బజ్‌రంగ్ పునియాలు క్రీడారంగంలో అత్యున్నత పురస్కారమైన ఖేల్‌రత్న అవార్డును అందుకున్న విషయం తెలిసిందే. వీరిలో సాక్షి మాలిక్(2017), బజరంగ్ పునియాలకు పద్మశ్రీ కూడా లభించింది. ఇదిలాఉంటే, దీక్షా శిబిరం వద్ద బుధవారం అర్ధరాత్రి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. పోలీసులు, రెజ్లర్ల మధ్య ఘర్షణ జరిగి పలువురు గాయపడ్డారు. నిరసనకారుల వసతి కోసం కొందరు మడత మంచాలు తీసుకురావడం ఈ ఉద్రిక్తతలకు కారణమయ్యింది.

# 65వ వార్డులో ఆక్రమణలను తొలగించిన రెవెన్యూ సిబ్బంది



గాజువాక (విజయభాను న్యూస్) : పెదగంట్యాడ మండలం జీవీఎంసీ 65వ వార్డు సచివాలయం 274 పరిధిలో శ్రీవేంకటేశ్వర స్వామి గుడి పేరుతో కొంతమంది ప్రభుత్వ భూమిని కబ్జాచేసి అక్రమంగా నిర్మించిన ఆరు ఇళ్లను బుధవారం అర్ధరాత్రి పెద గంట్యాడ మండలం రెవెన్యూ సిబ్బంది తొలగించారు.

ప్రభుత్వ భూమిని అక్రిమించిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎం ఆర్ ఓ రమాదేవి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది శివ, సాయిప్రకాష్, జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com